

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	585 (297.4350)	4,16,324	4,16,324
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.45 (4.06)	2,571	1,702
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.3237 (41.7627)	51,409	51,409

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.220


అందరికీ శుభం జరగాలి



మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా ప్రజలందరికీ శుభం జరగాలని రాష్ట్ర రోడ్డు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. వినాయక చవితి సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆనందోత్సాహాల నడుమ వినాయక చవితి వేడుకలు నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి నిర్విఘ్నంగా కొనసాగుతున్న వేళ సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి గడపకు చేరి ప్రజలందరి జీవితాల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

గణపయ్యా.. విఘ్నాలు తొలగించవయ్యా!



- చల్లగా చూడాలని ప్రార్థనలు
- ధాన్యపురాశులు గలగలలాడేలా ఆశీర్వదించాలని కర్షకుల వేడుకోలు
- పదవీయోగం కలిగేలా చూడు స్వామి అంటున్న నేతలు
- నేడు వినాయక చవితి

విఘ్నేశ్వరుడు నవరాత్రులపాటు పూజలందుకునేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఊరూరా, వాడవాడలా గణేశ్ విగ్రహాల ప్రతిష్ఠకు భక్తులు సన్నాహాలు చేసుకున్నారు. భారీ గణపయ్యలు, పలు రకాల అలంకరణలతో పాటు, మట్టి గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించి తొమ్మిది రోజులు ఘనంగా పూజలు నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే గణేశ్ మండపాల వద్దకు గణపతి విగ్రహాలను తీసుకొచ్చారు. సకల విఘ్నాలు తొలగించే గణేశుడు ఈసారి తమ కష్టాలను తొలగించాలని స్వామివారిని ప్రార్థించేందుకు భక్తులు సిద్ధమయ్యారు.

● ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ

ఈ ఏడాది పంటలు పండి ఒడ్డున పడాలని, ధాన్య పురాశులతో గాదెలు నిండేలా కరుణించాలని అన్నదాతలు గణేశుడిని ప్రార్థిస్తున్నారు. పదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉండి అష్టకష్టాలు పడ్డామని, తమ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచిందని, తమకు గుర్తింపు కలిగించేలా ప్రభుత్వ పెద్దల మనసు మారి పదవులిచ్చేలా విఘ్నేశుడు దయచూపాలని రాజకీయనేతలు కోరుతున్నారు. ఈ ఏడాది కలిసివచ్చేలా ఆశీర్వచనం చేయాలని ప్రతిపక్షాల నాయకులు పూజిస్తున్నారు. తొలి పూజలందుకునే గణేశుడికి మొర విన్నవిస్తే శుభఫలితమిస్తారనే ఆశాభావంతో భక్తులు ఈ గణేశ్ చతుర్థిని భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.

ధాన్యపురాశులు పండేలా ఆశీర్వదించు స్వామీ

ఈ ఏడాది సీజన్ ఆరంభంలో వర్షాలు లేక ఇబ్బంది పడ్డా, ప్రస్తుతం అనుకూలంగా ఉందని, ఇదే వాతావరణం కొనసాగి పంటలు బాగా పండి, ధాన్యపురాశులు నిండేలా ఆశీర్వదించాలని రైతులు గణేశుడిని కోరుకుంటున్నారు. ఇటీవల వర్షాలతో వరుణదేవుడు కన్నెర్రజేశాడని, ఆ ప్రభావంనుంచి బయటపడి పంటలు చేతికందేలా ఎలాంటి విఘ్నాలు లేకుండా వినాయకుడు చల్లని చూపు చూడాలని రైతులు ప్రార్థిస్తున్నారు. కూరగాయలు, వంటనూనెలు, మిగతా 8వ పేజీలో...

పంచాయతీ ఎన్నికలపై ముందుకు

- సెప్టెంబరు 2న ఓటర్ల జాబితా
- ఖరారుకు షెడ్యూల్ ప్రకటించిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- ఇప్పటికే కొనసాగుతున్న జాబితా తయారీ ప్రక్రియ

నల్లగొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రాథమిక కసరత్తు నిర్వహిస్తోంది. ఇప్పటికే వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను రూపొందించే కార్యాచరణను పంచాయతీల వారీగా చేపట్టింది. తాజాగా, మంగళవారం రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ.రాణీకుముదిని పంచాయతీ ఓటర్ల జాబితాల వెల్లడికి తుది షెడ్యూల్‌ను ప్రకటించారు.

గ్రామపంచాయతీలు, వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితాలను ఆయా పంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయాల వద్ద ఈనెల 28న అన్ని ప్రదర్శించనున్నారు. 29న జిల్లా ఎన్నికల అథారిటీ ఆధ్వర్యంలో రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారు. 30న మండల స్థాయిల్లో ఎంపీడీవోల అధ్యక్షతన రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తారు. 28 నుంచి 30వరకు ప్రచురితమైన ఓటర్ల జాబితాల్లో ఏవైనా అభ్యంతరాలు, ఇతర ఫిర్యాదులను తీసుకుంటారు. 31న ఈ అభ్యంతరాలు, ఫిర్యాదులను జిల్లా పంచాయతీ అధికారి పరిష్కరిస్తారు. సెప్టెంబరు 2న తుది ఫొటో ఓటర్ల జాబితాలను వార్డుల వారీగా జిల్లా పంచాయతీ అధికారి ప్రచురిస్తారు. ఈమేరకు జిల్లాలో ఇప్పటికే కొనసాగుతున్న వార్డుల వారీ ఓటర్ల జాబితా కసరత్తు చివరి దశకు చేరిందని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య తెలిపారు.

కొనసాగుతున్న ఓటర్ల జాబితా తయారీ

జిల్లాలో వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోంది. జిల్లాలోని 33 మండలాల్లోని 869 గ్రామ పంచాయతీల్లో, 7,494 వార్డులను ఏర్పాటు చేశారు. ఈ పంచాయతీలన్నింటిలో కలిపి 10,53,920 మంది ఓటర్లు నమోదయ్యారు. ఒక కుటుంబం ఓట్లన్నీ ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం సూచించడంతో ఆమేరకు పంచాయతీ కార్యదర్శులు జాబితాలను సవరిస్తున్నారు. సవరించిన జాబితాలను టీపోల్ యాప్‌లో వార్డుల వారీగా అప్‌లోడ్ చేశారు. జిల్లాలో వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు దాదాపుగా అప్లోడ్ చేసినట్లు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు ఎన్నికలకు ఆదేశించినా తక్షణమే నిర్వహించేందుకు వీలుగా ఇప్పటికే పోలింగ్ స్టేషన్లను సైతం గుర్తించారు. 7,494 పోలింగ్ స్టేషన్లు పంచాయతీ ఎన్నికలకు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం తాజాగా ఇచ్చిన ఆదేశాల ప్రకారం వచ్చే నెల 2వ తేదీన పంచాయతీ ఓటర్ల తుదిజాబితా వెలువడడంతో జాబితా ప్రక్రియ కొలిక్కిరానుంది.

జాతీయ పథకంపై ప్రచారం కల్పించాలి



గట్టుప్పల్‌లో పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద జిల్లాలో 3,500 మందిని చేర్చుకునే అవకాశం ఉందని, అందుకు అర్హులు దరఖాస్తు చేసుకునేలా విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకంపై మంగళవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. తహసీల్దార్, ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల్లో ప్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ పథకం కింద ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా సుమారు 2,070 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను తహసీల్దార్లు పరిశీలించి ఆర్డీవోలకు సమర్పించాలని, ఆర్డీవోలు ఆన్‌లైన్‌లో డీఆర్వోకు సమర్పించాలని ఆదేశించారు. టెలీకాన్ఫరెన్స్‌లో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలి

(ఆంధ్రజ్యోతి, గట్టుప్పల్): మండల కేంద్రానికి మంజూరైన పీహెచ్‌సీ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మంగళవారం పీహెచ్‌సీ నిర్మాణ పనులను, ఎస్టీ హాస్టల్‌ను ఆమె తనిఖీ చేశారు. ఆమె వెంట తహసీల్దార్ రాములు, ఎంపీడీవో మాదవరెడ్డి, కార్యదర్శి ఎండీ.షఫీ ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

(ఆంధ్రజ్యోతి, మునుగోడు): ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మంగళవారం మునుగోడు పీహెచ్‌సీని కలెక్టర్ తనిఖీ చేశారు. ఆమె వెంట ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ ఎన్.నరేష్, ఎంపీడీవో యుగందర్‌రెడ్డి, డాక్టర్ నర్మద ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



మట్టి గణపతి విగ్రహాలను పంపిణీచేస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని నాగార్జున డిగ్రీ కళాశాల ఆవరణలో క్రెడాయ్ ఆధ్వర్యంలో 1,000 మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రెడాయ్ అసోసియేషన్ మట్టి గణపతులను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, క్రెడాయ్ రాష్ట్ర కార్యదర్శి బండారు ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఏచూరి భాస్కర్, ఆమంచి రాజలింగం, నాంపల్లి మనోహర్, దూదిపాల వెంకట్‌రెడ్డి, ఏదుళ్ల శ్రీధర్‌రెడ్డి, ఆవుల శ్రీనివాస్, వంగాల అనిల్‌రెడ్డి, రామారావు, పృథ్వీ, పుల్లారావు, లింగయ్య, పాల్గొన్నారు.

నూతన పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ

నిడమనూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నూతన పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సోమవారం పరిశీలించారు. రిసెప్షన్ మేనేజ్‌మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్, స్టేషన్ రైటర్, లాకప్, ఎస్‌హెచ్‌వో గది, తదితర ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఆయనకు మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం మొక్క బహూకరించగా, స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అయన వెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ సతీష్‌రెడ్డి, ఎస్ఐ ఉప్పు సురేష్ ఉన్నారు.

తాగునీటి పనులను డిసెంబరులోగా పూర్తి చేయాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, రామగిరి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ మునిసిపాలిటీ పరిధిలో చేపట్టిన తాగునీటి పనులను డిసెంబరులోగా పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం నల్లగొండ మునిసిపాలిటీలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో అమృత్ పథకం కింద సుమారు రూ.56.75కోట్లతో చేపట్టిన తాగునీటి ట్యాంకుల నిర్మాణ పనులు డిసెంబరులోగా పూర్తిచేసి ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. అలాగే ట్యాంకులకు నీరు అందించేందుకు అవసరమయ్యే అదనపు నిధులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మునిసిపాలిటీలో రూ.109కోట్ల ఎస్డీఎఫ్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, మురుగు కాల్వల పనులను మూడు నెలల్లో పూర్తి చేయాలని అన్నారు. నిధులు సరిపోకుంటే తన దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే రాత్రి, పగలు పనులు నిర్వహించి రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ పనులపై ప్రతీ మంగళవారం తాను సమీక్షిస్తానని తెలిపారు. చందనపల్లి బయోమైనింగ్ డంపింగ్ యార్డును త్వరితగతిన శుభ్రం చేయించాలన్నారు. మునిసిపాలిటీలోని అన్ని ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. చెత్త సేకరణకు బుట్టలను ఇంటికీ సరఫరా చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాములు, డీఈలు కార్తీక్, అశోక్, శ్రీధర్‌రెడ్డి, ఏఈలు దిలీప్, ప్రవీణ్, అసిం బాబా, ఏసీపీ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజించాలి

ప్రతీ ఒక్కరు మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నల్లగొండ మునిసిపాలిటీ ఆధ్వర్యంలో సుమారు 4,100 మట్టి వినాయకులను ప్రజలకు ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీ పర్యవేక్షణలోనే ఇబ్రహీంపేట



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో

హాలియా, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సీడీఎంఏ, పీఆర్ కమిషనర్ల నుంచి అధికార పత్రాలు వచ్చేదాక హాలియా మునిసిపాలిటీ నుంచి వీడిన ఇబ్రహీంపేట గ్రామాన్ని మునిసిపాలిటీ పర్యవేక్షణలోనే చూడాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) వెంకయ్య అన్నారు. మంగళవారం కలెక్టర్ సూచనల మేరకు ఇబ్రహీంపేట గ్రామ పంచాయతీకి మునిసిపాలిటీ నుంచి రావాల్సిన ఆస్తులు, సిబ్బంది, రికార్డ్స్ తదితరాల గురించి అనుముల మండల ఎంపీడీవో కార్యాలయానికి వచ్చారు. ఈసందర్భంగా ఇబ్రహీంపేట గ్రామానికి వెళ్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, ఎంపీడీవో సుజాత, ఎంపీవో ఘనపురం నిరంజన్, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో టీకాలు వేయించాలి

కనగల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మూగజీవాలకు సకాలంలో టీకాలు వేయించాలని పశువైద్య సంచాలకుడు డాక్టర్ డీవీ రమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మాజీగూడెంలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో సన్నజీవాలకు పీపీఆర్ టీకాలను వేశారు. ఈసందర్భంగా డీవీ.రమేష్ మాట్లాడుతూ మూగజీవాల పెంపకం వాటికి రోగాలు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్రామంలో 550 సన్నజీవాలకు(మేకలకు) టీకాలను వేసినట్టు కనగల్ పశువైద్యాధికారి సీహెచ్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది హనీఫ్, నాగేశ్వరి తదితరులున్నారు.



జీవాలకు టీకాలు వేస్తున్న డాక్టర్ బాబు

ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలి

● **డీఆర్‌డీఏ అదనపు పీడీ నవీన్‌కుమార్**

మునుగోడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం పనులు పారదర్శకంగా చేపట్టాలని డీఆర్‌డీఏ అదనపు పీడీ నవీన్‌కుమార్ అన్నారు. మునుగోడు మండల పరిషత్ కార్యాలయ మావేశ మందిరంలో మంగళవారం జాతీయ ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు మండలంలో చేపట్టిన పనుల వివరాలు చదివి వినిపించారు. రూ. 6.90 కోట్ల నిధుల ఖర్చుతో ఉపాధి హామీ పనులు జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. నిర్దేశించిన నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలన్నారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ సీహెచ్.వేణుగోపాల్‌రావు, అంబుడ్స్‌మన్ ఎంఏ. ఘని, సామాజిక తనిఖీ రాష్ట్ర రిసోర్స్ పర్సన్ సురేంద్రబాబు, ఎంపీడీవో యుగంధర్‌రెడ్డి, ఎంపీవో మహ్మద్ అథర్ పర్వేజ్, ఏపీవోలు నాగరాజు, శీనయ్య, వివిధ గ్రామాల కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, సామాజిక తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

పాఠశాలల బలోపేతమే ధ్యేయం

ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

శాలిగౌరారం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని, ప్రభుత్వ విద్య బలోపేతమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెర్కకొండారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల వికాస్ స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో 20 డెస్క్ బెంచీలను పంపిణీచేసి, ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులను స్వచ్ఛంద సంస్థలు ప్రోత్సహించాలన్నారు. పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. బాలవికాస్ లాంటి సంస్థలు ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బాలవికాస్ సీఈవో బాలశౌరి, కాంగ్రెస్ నాయకులు నూక కిరణ్‌కుమార్‌యాదవ్, గచ్చిబౌలి కీస్టోన్ స్కూల్ ఫౌండర్ లక్ష్మిరెడ్డి, తహసీల్దార్ షేక్ జహీరుద్దీన్, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి, ఎంఈవో మండుల సైదులు, మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తాళ్లూరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, పాల్గొన్నారు.

బిహార్ నుంచి గంజాయి తెచ్చి..

- పోలీసులకు పట్టుబడిన ముఠా
- 1350 గ్రాముల గంజాయి, 22 గంజాయి చాక్లెట్స్ స్వాధీనం
- మొత్తం 13 మంది నిందితులు, 10 మంది అరెస్ట్

6

ప్రభుత్వ భూమిలో మట్టి దందా

- సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కొత్తగూడెం గ్రామస్థులు

తప్పని నిరీక్షణ

మునుగోడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మునుగోడు మండలంలో రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెల్లవారుజాము నుంచే స్థానిక సహకార సంఘం వద్దకు తరలివచ్చి యూరియా కోసం ఎదురు చూస్తున్నారు. గంటల తరబడి క్యూలైన్లో నిలబడినా అవసరమైన యూరియా అందటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పంటల పెరుగుదల దశలో ఉన్నాయి. అదునులో అవసరమైన ఎరువుల చల్లుకోవాల్సి ఉన్నా అది అందకపోవటంతో బిక్కమొఖం వేయాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి తిరుగుతున్నా సరిపడ యూరియా అందటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. వచ్చిన కొద్దిపాటి యూరియాను అందరు రైతులకు పంచుతున్న క్రమంలో సరిపడ యూరియా లభ్యంకావటం లేదని పేర్కొన్నారు. మునుగోడు పీఏసీఎస్ వద్ద మంగళవారం రైతులు యూరియా కోసం తరలివచ్చారు. కానీ మొన్న వచ్చిన రైతులకు ఇచ్చిన టోకెన్ల ప్రకారం యూరియా ఉండటంతో మిగిలిన రైతులకు దొరకని పరిస్థితి. దీంతో యూరియా కోసం పడిగాపులతో నరీక్షణ తప్పటం లేదని వారు వాపోతున్నారు.

రెండు బస్తాల కోసం సాయంత్రం వరకూ క్యూలోనే..



యూరియా కొరత రైతులను వెంటాడుతోంది. రెండు బస్తాల యూరియా కోసం గంటల తరబడి క్యూలైన్లలో ఉంటున్నారు. ఆడ, మగ, పిల్లలు, వృద్ధులు తేడా లేకుండా గంటల కొద్దీ నిరీక్షిస్తున్నారు. నల్లగొండ జిల్లా డిండి మండలంలోని తవక్లాపూర్ సొసైటీకి మంగళవారం 222 బస్తాల యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న రైతులు ఉదయం సొసైటీకి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వేచి చూస్తే ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున అందజేశారు. దొరకని రైతులు నిరాశతో వెనుదిరిగారు. తవక్లాపూర్ సొసైటీకి 150టన్నుల యూరియా వచ్చిందని సీఈవో తెలిపారు. డిండి ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో ఈ వానాకాలం 12,500 ఎకరాలు సాగులోకి వచ్చింది. బోరు బావులు ఉన్న రైతులు ముందుగా తుకాలు పోసి వరినాట్లు వేశారు. ముందు నాట్లువేసిన పొ లాలు యూరియా చల్లేదశలో ఉండడంతో రైతులు సొసైటీల వద్దకు చేరుకున్నారు. ● ఆంధ్రజ్యోతి, డిండి.

రైతుల గోడు పట్టదా : సీపీఎం

నల్లగొండ రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం కష్టాలు పడుతూ రోడ్డు పడ్డ రైతుల గోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టదా అని సీపీఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ప్రశ్నించారు. జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో రైతులకు యూరియా అందించాలన్నారు. బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా అధికారులు పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లాకు 70వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరముందని జిల్లా వ్యవసాయ అధికారులు గుర్తించినా, ఇప్పటివరకు కేవలం 49వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా అయిందన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాలు ఒకవైపు పడుతుంటే యూరియా లేకపోవడంతో సేద్యం చేసిన పంటలు తగిన దిగుబడి రాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నారీ ఐలయ్య, డి. మల్లేష్, బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, ప్రభావతి, కందాల ప్రమీల, సయ్యద్ హాషం, చినపాక లక్ష్మీనారాయణ, వీరపల్లి వెంకటేశ్వర్లు, సలీం ఉన్నారు.

యూరియా కోసం బారులు

హాలియా, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా హాలియా మండలంలోని కొత్తపల్లి పీఏసీఎస్ వద్ద యూరియా కోసం మంగళవారం రైతులు బారులు తీరారు. తెల్లవారుజామునుంచే లైన్లు నిలబడుతున్నామని అయినా సరిపోను యూరియా అందడం లేదని రైతులు ఆవేదనను వ్యక్తం చేశారు. పీఏసీఎస్ వద్ద ఉన్న రైతులతో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ మాట్లాడారు. రైతులకు కావాల్సిన యూరియాను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. అనంతరం అక్కడ హాలియా ఏడీఏ సరితతో మాట్లాడి రైతుల కష్టాలను వివరించారు. అలాట్‌మెంట్ ప్రకారం ప్రతి రోజు రైతులకు యూరియా అందిస్తున్నామని ఏడీఏ తెలిపారు.



కొత్తపల్లి పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

రెండోరోజూ పడిగాపులే

కేతేపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేతేపల్లిలో మంగళవారం రెండో రోజు పీఏసీఎస్‌కు 445బస్తాల లారీలోడు యూరియా దిగుమతి అయింది. విషయం తెలిసిన మండలంలోని వివిధ గ్రామాల రైతులు ఉదయమే కేతేపల్లికి చేరుకున్నారు. అధికారులు ఒక్కో రైతుకు రెండు బస్తాల యూరియా అందజేశారు.

మునగాల: సూర్యాపేట జిల్లా మునగాల మండలకేంద్రంలో యూరియా కోసం రైతులు పాట్లు పడ్డారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉన్న కొంత మంది యూరియా దొరకకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ఎన్నడూ లేని విధంగా యూరియా కొరత ఏర్పడడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



కేతేపల్లి పీఏసీఎస్‌లో యూరియా బస్తాలు దిగుమతి చేస్తున్న హమాలీలు

చిన్నారిని చిదిమేసిన వాహనం

కొండమల్లేపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఓ వాహనం చిన్నారిని చిదివేసింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల పరిధిలోని బాపూజినగర్ మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొండమల్లేపల్లి మండల పరిధిలోని కోల్‌ముంతలపహాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని బాపూజినగర్‌కు చెందిన పీట్ల రాజు, సంధ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రాజు హైదరాబాద్‌లో ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వినాయక చవితి పండుగ కోసం సోమవారం బాపూజినగర్ గ్రామానికి వచ్చారు. మంగళవారం ఉదయం రాజు కుమార్తె అక్షర(4) నానమ్మ సుగుణమ్మతో కలిసి రోడ్డు దాటుతుండగా దేవరకొండ నుంచి కొండమల్లేపల్లి వైపు వేగంగా వెళ్తున్న బొలైరో వాహనం ఢీకొట్టింది. దీంతో త్రీవ గాయాలపాలైన అక్షరను చికిత్స నిమిత్తం దేవరకొండ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా కుమార్తె మృతితో తల్లిదండ్రుల కన్నీరుమున్నీరుగా విలపించారు.



అక్షర(ఫైల్)

బిక్కేరు వాగులో పడి వ్యక్తి మృతి

గుండాల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలంలోని అంబాల బిక్కురు వాగులో పడి మంగళవారం ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ తేజంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని నేరేడుమెట్టుకు చెందిన బీర బాలరాజు(53) రెండు రోజుల క్రితం మోత్కూరుకు వచ్చాడు. అక్కడి నుంచి ఆత్మకూర్ మండలం పారుపల్లి గ్రామంలో ఉన్న అత్తగారింటి వద్ద మైసమ్మ పండుగ ఉండడంతో అంబాల శివారు నుంచి కాలినడకన చెక్ డ్యాంపై నడుచుకుంటూ వెళ్తుండగా కాలు జారి చెక్ డ్యాంపై నుంచి ప్రమాదవశాత్తు వాగులో పడిపోయాడు. పరిసర ప్రాంతాల రైతులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాలరాజు కుమారుడు నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెవెన్యూ కార్యాలయ రికార్డు అసిస్టెంట్ సస్పెన్షన్

మోత్కూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు రెవెన్యూ కార్యాలయంలో పహాణి నకళ్లు, ఆర్వోఆర్ లెటర్ కాపీ ఇవ్వడానికి రైతుల నుంచి డబ్బులు తీసుకున్న రికార్డు అసిస్టెంట్ బుంగ చరణ్‌రాజ్‌ను కలెక్టర్ హనుమంతరావు సస్పెండ్ చేశారు. పహాణీలు వెతికినందుకు తనకు, సంతకాలు చేసినందుకు డిప్యూటీ తహసీల్దార్‌కు ఇవ్వాలని ఇద్దరు రైతుల నుంచి రికార్డు అసిస్టెంటు చరణ్‌రాజ్ రూ.1800 వసూలు చేసిన విషయాన్ని 'పైసలు ఇవ్వందే ఫైల్ కదలదు' శీర్షికన ఈ నెల 25న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఈ నెల 25న భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి మోత్కూరు తహసీల్దార్ కార్యాలయంలో విచారణ జరిపి ఇచ్చిన నివేదికతో కలెక్టర్ హనుమంతరావు రికార్డు అసిస్టెంట్ చరణ్‌రాజ్‌ను సస్పెండ్ చేశారని, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్‌ను రాజాపేటకు డిప్యూటేషన్‌పై పంపారని తహసీల్దార్ పి. జ్యోతి తెలిపారు. రికార్డు అసిస్టెంట్ చరణ్‌రాజ్ నుంచి డబ్బులు రికవరీ చేసి బాధిత రైతులు గంట శ్రీనివాస్‌రెడ్డి, బాసోజు అంజయ్యాచారికి తిరిగి ఇప్పించామని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

నూతనకల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండల పరిధిలోని మాచనపల్లి గ్రామ శివారులో గల పాలేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ రావుల నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మాచనపల్లి గ్రామం నుంచి ఇసుక తరలిస్తున్న ఆత్మకూరు ఎస్ మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన రాచకొండ వినయ్ తన ట్రాక్టర్‌తో ఇసుక అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి స్వాధీనం

మోతె, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మోతె మండలకేంద్రంలో గంజాయి ప్యాకెట్లతో యువకులు పట్టుబడ్డారు. ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండలకేంద్రానికి చెందిన యువకుడు, ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన మరో యువకుడు కలిసి భద్రాచలంలో ఒరిస్సాకు చెందిన ముగ్గురు వ్యక్తుల వద్ద కొనుగోలు చేసి మోతె గ్రామశివారులో ఉన్న రత్నాలకుంట చెరువు కట్ట వెంట దాచిపెట్టారు. వాటిని మంగళవారం బయటకు తీస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు ఎస్ఐ సిబ్బందితో కలిసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న ఒక కేజీ 200 గ్రాముల గంజాయి ప్యాకెట్లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరితో పాటు మరో ముగ్గురిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ డీలర్ సస్పెన్షన్

మేళ్లచెర్వు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన రేషన్ డీలర్ కొట్టె నరసింహారావును సస్పెన్షన్ చేస్తున్నట్లు తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రామాపురంలో వెలుగు చూసిన అక్రమ మద్యం కేసులో ముద్దాయిగా ఉండడంతో రేషన్ డీలర్ నర్సింహారావును సస్పెండ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.



భారీ కొండ చిలువ హతం

వలిగొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం దుప్పెల్లిలో భారీ కొండచిలువను చంపారు. మంగళవారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు పలుసం నర్సయ్య తాటి చెట్టు వద్దకు వెళ్తుండగా 10 అడుగుల భారీ కొండచిలువ కనబడింది. భయంతో దానిని నర్సయ్య చంపివేశాడు.

బిహార్ నుంచి గంజాయి తెచ్చి..

● 10 మంది అరెస్ట్.. పరారీలో ముగ్గురు నిందితులు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బిహార్ రాష్ట్రం నుంచి గంజాయి తెచ్చి విక్రయిస్తున్న వారివద్ద నుంచి కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్న నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు వివరాలు వెల్లడి ంచారు. వైష్ణవి రైస్‌మిల్లులో హమాలీగా పనిచేస్తున్న బిహార్ రాష్ట్రం పుడ్‌కి చౌక్, గోగురి టానాకు చెందిన రాజ్‌కుమార్ పటేల్, సికిందర్ మిర్యాలగూడ సీతారాంపురానికి చెందిన సమీర్ బిహార్ నుంచి గంజాయి, గంజాయి చాక్లెట్లను రవాణా చేసి విక్రయిస్తున్నారు. మాడ్గులపల్లి మండలం పూసలపాడు గ్రామానికి చెందిన కొండేటి యశ్వంత్ అలియాస్ చింటూను పరిచయం చేసుకుని అతని ద్వారా మాడ్గులపల్లి మండలంలోని పలువురు యువకులకు విక్రయిస్తున్నాడు. ఈ నెల 25న రాజ్‌కుమార్ పటేల్, చింటూ గంజాయి, గంజాయి చాకెట్లను విక్రయించేందుకు మాడ్గులపల్లి పాత రైల్వేక్వార్టర్ వైపు బండి వెళ్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు వెళ్లగా మాడ్గులపల్లి మండలం పూసలపాడుకు చెందిన కోడెల శివ, వ్యవసాయ కూలీ బొల్లెపల్లి విష్ణు, దాచారానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ బుర్రి లోకేశ్, పూసలపాడుకు చెందిన వ్యవసాయ కూలీ దైద సందీప్, ట్రాక్టర్ డ్రైవర్ గుండెబోయిన వంశీ, డెకరేషన్ వృత్తి చేసే ఇందుగుల గ్రామానికి చెందిన పందిరి చరణ్ అలియాస్ మాస్, కార్ డ్రైవర్ మి ర్యాల వివేకానందరెడ్డి, దాచారానికి చెందిన బుర్రి నవీన్‌లకు గంజా యి విక్రయిస్తుండగా అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 1350 గ్రాముల గంజాయి, 22గంజాయి చాక్లెట్స్(సెవన్ మినార్ వాటి), ఎనిమిది సెల్ ఫోన్లు, మూడు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. బిహార్‌కు చెందిన సికిందర్, మిర్యాలగూడ సీతారాంపురకు చెందిన సమీర్, ఉన్నావ్ నెహ్రూబాగ్‌కు చెందిన చాక్లెట్ కంపెనీ శివంపార్మా డైరెక్టర్లు పరారీలో ఉన్నారు. మొత్తం 13మంది నిందితుల్లో ముగ్గురు పరారీలో ఉన్నారు. పది మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ రాజశేఖర్‌రాజు పర్యవేక్షణలో కేసును ఛేది ంచిన రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, మాడ్గులపల్లి ఎస్ఐ క్రిష్ణయ్య, ఏఎస్ఐ నరసింహారావు, జాఫర్, హెడ్ కానిస్టేబుల్ సీహె చ్. శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, పీసీలు ఎం. సైదిరెడ్డి, పి. అనిల్, ఎస్. ఆంజనేయులు, యాదయ్య, నరేష్, సైదులు, శ్రీనునాయక్‌ను డీఎస్పీ అభినందించారు.

ప్రభుత్వ భూమిలో మట్టి దందా

● సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు



ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వుతున్న ఎక్స్కవేటర్

మిర్యాలగూడ రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని కొత్తగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. ఈ విషయంపై గ్రామస్థులు మంగళవారం సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు వినతిపత్రం అందజేశారు. రాజకీయ నాయకుల అండదండలు, వ్యాపార వర్గాల పెత్తనంతో ప్రభుత్వ భూముల్లో అడ్డగోలుగా తవ్వకాలు చేపడుతున్నారు. కొత్తగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నెం.42లో ఉన్న సుమారు 6.5ఎకరాల ప్రభుత్వ భూమిలో తవ్వకాలు చేపడుతూ రేయింబవళ్లు మట్టిదందా సాగిస్తున్నారు. ప్రభుత్వ భూమిలో ఉన్న గట్టుపక్కనే ఏర్పాటు చేసిన ఓ రైస్‌మిల్లు గోదాం నిర్మాణానికి మట్టి విక్రయిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

భవిష్యత్తు అవసరాలకు భూమి కరువు

కొత్తగూడెం గ్రామంలో నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీతోపాటు అగ్రవర్ణాల పేదలకు భవిష్యత్తులో అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ భూమి ఈ సర్వే నెంబర్‌లోనే ఉంది. ప్రభుత్వం అందించే ఇంటి నిర్మాణాలు, ప్రజా సౌకర్యాల కోసం, భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడే భూమిని ఆక్రమించుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొంటున్నారు. పల్లె ప్రకృతివనం కోసం గత ప్రభుత్వం 2.5ఎకరాల భూమిని కేటాయించగా ప్రస్తుతం కేవలం అర ఎకరంలో మాత్రమే ప్రకృతి వనం దర్శనమిస్తుంది. డంపింగ్‌యార్డు కోసం కేటాయించిన స్థలం సైతం కబ్జాకు గురవుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ఎక్స్కవేటర్‌తో ప్రభుత్వ భూమిలో గుంతలు ఏర్పడేలా తవ్వి మట్టి దందా సాగిస్తున్నారు. మిల్లు యాజమాన్యం నిర్మిస్తున్న గోదాం స్థలం కొంతభాగం ప్రభుత్వ భూమిలో ఉన్నట్లు పలు రకాల ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలున్నాయి. ఈ విషయంపై గ్రామస్థులు సబ్ కలెక్టర్‌ను కలిసి ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా, అక్రమంగా మట్టి తరలించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు.



నిర్మాణంలో గోదాముకు మట్టిని తరలిస్తున్న టిప్పర్

రెవెన్యూ అధికారులకు తెలియపరిచాం

కొత్తగూడెం గ్రామంలోని సర్వే నెం.42లో అక్రమ తవ్వకాలు చేపట్టి మట్టి విక్రయాలు చేపడుతున్న విషయాన్ని రెవెన్యూ అధికారులకు తెలియపరిచాం. రెవెన్యూ అధికారులు చట్టపరంగా చర్యలు తీసుకుంటారు.

● వీరనాయక్, కొత్తగూడెం పంచాయతీ కార్యదర్శి.

విచారణ చేస్తాం

నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూమిలో అక్రమంగా తవ్వకాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. కొత్తగూడెం గ్రామంలోని ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు చేపట్టే విషయం మా దృష్టికి రాలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

● సురేష్, మిర్యాలగూడ తహసీల్దార్.

ఉపాధ్యాయులకు పండుగ కానుక

● 80 మంది ఎస్‌జీటీలకు ఎస్ఏలుగా పదోన్నతి

● 21 మందికి పీఎస్ హెచ్ఎంలుగా

● అభ్యంతరాలతో ముగ్గురి ప్రమోషన్లు నిలుపుదల



భువనగిరి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రమోషన్ రూపకంలో విద్యాశాఖ ఉపాధ్యాయులకు వినాయక చవితి పండుగ కానుకను ఇచ్చింది. యాదాద్రిభువనగిరి జిల్లాలో 80 మంది స్కూల్ అసిస్టెంట్లుగా, 21 మందికి పీఎస్ హెచ్ఎంలుగా మొత్తం 101మంది ఎస్‌జీటీలకు మంగళవారం పదోన్నతి లభించింది. ఇందులో నలుగురు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కాగా మిగతా 97 మంది లోకల్ బాడీ పాఠశాలల ఉపాధ్యాయులు. ఈ మేరకు డీఈవో కే సత్యనారాయణ పదోన్నతి, బదిలీల ఉత్తర్వులను జారీ చేశారు. అయితే అభ్యంతరాలు రావడంతో ముగ్గురి ప్రమోషన్లను నిలిపివేశారు. అయితే ప్రమోషన్ ఆగిన వారిలో ముగ్గురూ లోకల్ బాడీ ఉపాధ్యాయులే కావడం గమనార్హం. ఇదిలా ఉండగా 22మంది స్కూల్ అసిస్టెంట్లకు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి లభించింది. వరుస ప్రమోషన్ల పర్వంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే బదిలీలు, ఖాళీల పూర్తి ప్రక్రియను కూడా వెంటనే చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

వివాదం

రామన్నపేట మండలం తుర్కపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎం నిరంజన్‌రెడ్డికి ప్రమోషన్ లభించడంపై ఉపాధ్యాయ సంఘాల తీవ్ర అభ్యంతరం తెలిపాయి. గతంలో చౌటుప్పల్ మండలం ఎంపీపీఎస్ లక్కారంలో పనిచేస్తున్నప్పుడు అదే మండలం మల్కాపూర్ ఎంపీపీఎస్‌కు డిప్యూటేషన్ ఇచ్చారు. కానీ అతను దీర్ఘకాలికంగా విధులకు గైర్హాజరు కావడంతో అప్పట్లో డీఈవో అతడి వేతనాన్ని ఆపారు. అనంతరం అతను తుర్కపల్లికి బదిలీ అయ్యాడు. కానీ ఇప్పటికీ గైర్హాజరు పీరియడ్ వేతనం సెటిల్‌మెంట్ కాలేదు. దీంతో ఏసీసీఏ రూల్స్‌కు వ్యతిరేకంగా ప్రమోషన్లు లభించడంపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆర్‌జేడి, కలెక్టర్, డీఈవోకు ఫిర్యాదులు చేశారు. దీంతో అతడి ప్రమోషన్లు నిలిపివేస్తున్నట్లు డీఈవో ప్రకటించారు. అలాగే ఇతర కారణాలతో మరో ఇద్దరి ప్రమోషన్లను నిలిపివేత జాబితాలో పెట్టినట్లు తెలిపారు.

ప్రమోషన్లు

ప్రభుత్వ పాఠశాలల్లో గణితం, సోషల్, ఇంగ్లీష్ సబ్జెక్టులలో ఒకరు చొప్పున ముగ్గురికి పీఎస్ హెచ్ఎంగా మరొకరికి మొత్తం నలుగురికి ప్రమోషన్లు లభించాయి. లోకల్ బాడీ స్కూల్స్‌లో 20 మందికి పీఎస్ హెచ్ఎంలుగా, 21 మందికి సైన్స్, 21 మందికి సోషల్, 17 మంది బయోసైన్స్, 15 మందికి గణితం, ముగ్గురికి ఫిజికల్ సైన్స్, ఒకరికి ఉర్దూ మీడియం బయోసైన్స్‌లో స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు లభించాయి.

హక్కుల సాధన కోసం యాదవులు ఐక్యం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడుకొండలు

కనగల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన కోసం యాదవులందరూ ఏకం కావాలని అఖిల భారత యాదవ మహాసభ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండలు కోరారు. మంగళవారం కనగల్ మండల కేంద్రంలో యాదవ సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానికఎన్నికల్లో యాదవులు అధిక స్థానాల్లో పోటీ చేయాలని సూచించారు. రాజకీయంగా బలమైన శక్తిగా ఎదిగినప్పుడే హక్కులను సాధించుకోవచ్చన్నారు. సమష్ఠిగా ఉన్నప్పుడే యాదవులకు రాజకీయాల్లో అధిక ప్రాధాన్యం లభిస్తుందన్నారు. అన్ని పార్టీలు యాదవ కులస్థులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇదిలావుంటే కనగల్‌లో సెప్టెంబరు మొదటి వారంలో నిర్వహించే సమావేశంలో నూతన మండల కమిటీని ఎన్నుకుంటామన్నారు. యాదవ సోదరులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి లోడంగి గోవర్ధన్‌యాదవ్, నాయకులు సుధాకర్, నర్సింహ్మ, శివ, జెట్టి శ్యాంసుందర్, మండలి పరమేష్‌యాదవ్, ఏటెల్లి సైదులు, క్రిష్ణయ్య, మాజీ సర్పంచ్‌లు క్రిష్ణయ్య, యాదయ్య, రామలచ్చయ్య, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

కూర్పుగా కూర్చుని..



యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని ట్రినిటీ విద్యా సంస్థల్లో వినాయకుడి రూపంలో కూర్చున విద్యార్థులు

మట్టి విగ్రహాలనే పూజిద్దాం..



చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని చందన స్కూల్ ప్రిన్సిపాల్ అవ్వారి రామేశ్వరీ కోరారు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని విద్యానగర్‌లో గల చందన స్కూల్‌లో మంగళవారం వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిం చారు. విద్యార్థులు మట్టితో తయారు చేసిన రంగురంగుల వినాయక విగ్రహాలను ప్రదర్శించారు. మట్టితో విగ్రహాలను అందంగా తయారు చేసిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ రామేశ్వరీ బహుమతులు అందజేశారు.



● పూజా పత్రికి డిమాండ్..

వినాయక పూజల్లో పత్రిని వినియోగిస్తారు. వివిధరకాల ఆకులు, పత్రాలు, పండ్లను స్వామి ముందు ఉంచడం ఆచారం. 21రకాల పత్రులతో పూజలు నిర్వహిస్తారు. ఈ పత్రాలతో పూజించే వారికి సంపదలు, అష్టైశ్వర్యాలు, కార్యసిద్ధి చేకూరుతుందని పండితులు చెబుతారు. అందులో ఆర్య పత్రం, అశ్వత్థపత్రి, గండకి (సీతాఫలం), దత్తూర పత్రం, దూర్వారం, బిల్వ పత్రం (మారేడు) , చూతపత్రం, దాచిమి పత్రం, తులసీపత్రం, ఆపామార్గ, మరువపు పత్రం, విష్ణుకాంత, అర్జునపత్రం, శమీ పత్రం, జాజిపత్రి (సన్నజాజి), సింధూర పత్రం, మాచిపత్రి, బృహస్పతి పత్రం, బవీరి పత్రం, దేవదారు పత్రాలు ప్రధానమైనవి.

ఏకదంతాయ.. వక్రతుండాయ

● వినాయక ఉత్సవాలకు వేళాయే..! ● ఉమ్మడి జిల్లాలో ముస్తాబైన మండపాలు

భూదాన్‌పోచంపల్లి, యాదగిరిగుట్ట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మన సంప్రదాయంలో నవరాత్రి ఉత్సవాలు చేసుకుంటాం. మొదటిది చైత్రమాసంలో వచ్చే వసంత నవరాత్రులు. రెండోవి భాద్రపదంలో గణపతి నవరాత్రులు, మూడోవి ఆశ్వయుజంలో శరన్నవరాత్రులు. పల్లెపల్లెలో వినాయ నవరాత్రులు వైభవంగా జరుగుతాయి. నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. ప్రత్యేక అలంకరణ చేసిన వీధి మంటపాల్లో ముగ్ధమనోహర రూపంలో మంత్రముగ్దులను చేసే(హరివిల్లు) రంగులు అద్దిన వినాయకులు దర్శనమివ్వనున్నారు. వేద మంత్ర పఠనాలతో వాడ వాడల విఘ్నేశ్వరుడు పూజలు అందుకుంటాడు. మంటపాల్లో భజన కీర్తనలు, భక్తి గీతాలతో నవ రాత్రోత్సవాల్లో గణనాథున్ని భక్తులు మొక్కులు తీర్చుకొని ముక్తిని పొందుతారు. ఏకదంతుడికి ప్రీతికరమైన పిండి వంటలు కుటుంబాల వారిగా తొమ్మిది రోజుల పాటు సమర్పిస్తారు.

మట్టి విగ్రహాలపై అవగాహన

గణనాథుని విగ్రహాల నిమజ్జనంలో జల కాలుష్య నివారణకు మట్టి వినాయకుల ప్రాధాన్యత ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ, సామాజిక వేత్తలు ఎంతగానో ప్రచారం నిర్వహిస్తూనే ఉన్నారు. పర్యావరణ పరిరక్షణకు రసాయనాలతో కూడిన రంగులు అద్దిన విగ్రహాలకు బదులు మట్టి విగ్రహాల పంపిణీ చేసి నీటి కాలుష్య నిర్మూలనకు ప్రభుత్వం పాటుపడుతోంది. సహజ మట్టి విగ్రహాలను విరివిగా అందుబాటులోకి తెచ్చి పర్యావరణాన్ని పరిరక్షించాలని పర్యావరణ వేత్తలు ఆకాంక్షిస్తున్నారు.



నల్లగొండలో మండపానికి తరలిస్తున్న భారీ వినాయక విగ్రహం



సూర్యాపేటలోని రాజీవ్‌నగర్‌లో ఏర్పాటు చేస్తున్న భారీ విగ్రహం

చిట్టి చేతుల్లో చక్కగా కుదిరి...

చిట్యాలరూరల్: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడుకు చెందిన ప్రాథమిక పాఠశాల, గుండ్రాంపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు మట్టి వినాయక ప్రతిమలు తయారుచేశారు. మట్టితో ప్రతిమలు తయారుచేయడం ఆనందంగా ఉందని, వాటిని తమ నివాసాల్లో ఏర్పాటుచేసి పూజలు చేస్తామని విద్యార్థులు తెలిపారు. వెలిమినేడు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తరగతుల వారీగా ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేసి, అభినందించారు. వినాయక చవితి పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పొట్టబత్తుల శ్రీనివాస్, వనజ, చంద్రకళ, సాజీదాసుల్తానా, అనూష, స్వరూప, సంగీత, సుజాత, స్రవంతి, మాధవి, ప్రవళిక, ఇందిర, సుమలత, విద్యార్థులు పాల్గొన్నారు.



చిట్యాలలో మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలు చూపుతున్న విద్యార్థులు

● మార్కెట్‌కు కొత్త కళ



వినాయక చవితి వేడుకల సందర్భంగా మార్కెట్లు కళకళలాడాయి. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మార్కెట్‌లో మండపాల అలంకరణకు వినియోగించే వస్తువులతో మార్కెట్ వీధులు నిండిపోయాయి. ఆ మార్గం మొత్తం అలంకరణ వస్తువులతో ఆకట్టుకుంది.

● వినూత్నంగా మండపం..



వినాయక మండపాల ఏర్పాటుకు భక్తులు పోటీపడుతున్నారు. భారీ పరిమాణంలో వివిధ ఆకృతుల్లో అలంకరిస్తున్నారు. భువనగిరిలో వినూత్నంగా ఏర్పాటు చేసిన వినాయక మండపం.

» మట్టి ప్రతిమకు సొబగులు



నల్లగొండ జిల్లాకేంద్రంలో మట్టి వినాయక విగ్రహం

» మూర్తులతో తీర్చిదిద్ది..



యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలో సిద్ధార్థ యూత్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు. ఆ విగ్రహనికే కుంకుమ(సింధూరం)తో తయారు చేసిన నాలుగు వేల చిన్న చిన్న ప్రతిమలు ఏర్పాటు చేశారు. ఈ విగ్రహం చూపరులను ఆకట్టుకుంటోంది.

» లంబోదరుడికి బిందె లడ్డూ..



యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో వినాయకుడి కోసం బిందె లడ్డూ

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణీ వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో, శివాలయంలో నిత్యపూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి.



ఆంజనేయుడికి హారతి సమర్పిస్తున్న అర్చకులు

టెండర్ల నిర్వహణకు అర్జీ

యాదగిరిగుట్టపైన వర్తకం పేరుతో కొనసాగుతోన్న దుకాణాల తరహాలో నిరుద్యోగ యువత కోసం మరిన్ని దుకాణాలు కేటాయించాలని పట్టణానికి చెందిన కొంతమంది యువకులు దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్, కమిషనర్, ఆలయ ఈవో ఎస్.వెంకట్రావుకు వేర్వేరుగా అర్జీలు అందజేశారు. లేని పక్షంలో అన్ని దుకాణాలకు టెండర్లు నిర్వహించాలని యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన బూడిద నాగరాజు, బూడిద సురేందర్, నక్కల బాలయ్య, ఎల్లేష్, రజనీకాంత్‌తో పాటు మరికొంతమంది యువకులు కోరారు.

సింగిల్ విండో సీఈవోల బదిలీ

మోత్కూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని అన్ని సింగిల్ విండోల కార్యదర్శులను (సీఈవోలను) బదిలీ చేశారు. గతంలో పదవీ విరమణ పొందినప్పుడు ఆ స్థానంలో కొత్తవారిని నియమించడం తప్ప సింగిల్ విండోల కార్యదర్శులకు బదిలీలు ఉండేవి కావు. సింగిల్ విండో వ్యవస్థ ఏర్పడిన నాటి (1985) నుంచి ఇంత వరకు కార్యదర్శుల బదిలీలు జరగలేదు. అలాంటిది రాష్ట్ర ప్రభుత్వ జీవో 44 ప్రకారం ఆకస్మికంగా కార్యదర్శుల మూకుమ్మడిగా బదిలీ చేయడం పట్ల కార్యదర్శులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ హైద్రాబాదు, ఎస్ఎల్ఈసీ కన్వీనర్ ద్వారా పీఏసీఎస్ ఉద్యోగుల బదిలీల కోసం యూనిఫార్మ్ హెచ్ఆర్ పాలసీలోని క్లాజ్ 8(1) నిబంధన అమలుకు మార్గ దర్శకాలు విడుదల చేశారు. ఏ కార్యదర్శి/ఉద్యోగి అయినా ఐదేళ్ల కన్నా ఎక్కువ కాలం ఒకే సంఘంలో పని చేయరాదన్న నిబంధన మేరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా (నల్లగొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు) పరిధిలోని సింగిల్ విండోల కార్యదర్శుల బదిలీలు చేపట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సింగిల్ విండోల కార్యదర్శులందరినీ ఒకే సారి బదిలీ చేయడం సింగిల్ విండో చరిత్రలో ఇదే తొలిసారి. బదిలీలు చేయడానికి కార్యదర్శుల నుంచి తొలుత నాలుగు ఆప్షన్లు తీసుకున్నప్పటికీ వారు ఇచ్చిన ఆప్షన్లకు ప్రాధాన్యం ఇవ్వకుండా డీఎల్ఈసీ ఈ నెల 25న కార్యదర్శులందరినీ ఒకేసారి బదిలీలు చేసిందంటున్నారు. ఈ బదిలీల్లో భాగంగా మోత్కూరు రైతుసేవా సహకార సంఘం కార్యదర్శి అడ్డగూడూరు సింగిల్‌విండోకు, అడ్డగూడూరు సింగిల్ విండో కార్యదర్శి మోత్కూరుకు బదిలీ అయ్యారు.

దేశ రక్షణకు ఎన్‌సీసీ దోహదం

నల్లగొండ టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సామాజిక శిక్షణ, దేశ రక్షణకు ఎన్‌సీసీ దోహద పడుతుందని కల్నల్ లక్ష్మారెడ్డి అన్నారు. మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థుల ఎంపిక మంగళవారం విశ్వవిద్యాలయ క్రీడా ప్రాంగణంలో 31వ బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు అవకాశం కల్పిస్తూ వారిలో ఔత్సాహితులను 400 మీటర్ల పరుగు, ఎత్తు, బరువు ఆరోగ్యం , రాత పరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు. ఈ ఎంపికకు 60 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో మెరుగైన ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేయనున్నట్లు ఎంజీయూ ఎన్‌సీసీ ఇన్‌చార్జ్ డాక్టర్ మచ్చేందర్ తెలిపారు. అనంతరం కల్నల్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సామాజిక అంశాలపై స్పృహ శిక్షణ కల్పిస్తూ పాల్పంచుకునే అవకాశం ఎన్‌సీసీ ద్వారా లభిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.సుధారాణి, బెటాలియన్ అధికారులు కొమ్ము మల్లయ్య, చంద్రవీర్, మాధవరావు పాల్గొన్నారు.

భావోద్వేగ స్థిరత్వం సాధించాలి

● బెస్ట్ యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ కె.నాగజ్యోతి

నల్లగొండ టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఒత్తిడి మయ జీవితంలో భావోద్వేగ స్థిరత్వం సాధించాలని బెస్ట్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.నాగజ్యోతి అన్నారు. మంగళవారం నాగార్జున ప్రభుత్వ కళాశాలలో జీవశాస్త్రాల ఆధ్వర్యంలో 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు - జీవశాస్త్రాల పాత్ర' అనే అంశంపై జరిగిన రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవశాస్త్రాల సుస్థిరతతో పాటు మనిషి భావోద్వేగ సుస్థిరత, అల్గోరిథమిక్ సుస్థిరతలను కూడా సాధించాల్సిన అవసరం ఏర్పడిందని అన్నారు. ఒత్తిడి నుంచి దూరం కావడానికి తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం 70 శాతం రోగాలు సామాజిక మాధ్యమాలతోనే వస్తున్నాయని తెలిపారు. ఇన్నేళ్ల గడిచినా ఇండియా కేవలం 65 శాతం మాత్రమే సుస్థిరత సాధించిందని అన్నారు. 2030 నాటికి ఇండియా 100 శాతం సుస్థిరత సాధిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మహిళలు నాయకత్వ బాధ్యతను చేపట్టడానికి ముందుకు రావడం లేదని, ఇది మారాలని అన్నారు. గద్ద కూడా తన శక్తిని గ్రహించకుండా కోడిపిల్లలతో పెరిగితే కోడిలాగే తయారవుతుందని అన్నారు. పరస్పరం ప్రోత్సహించుకుని, కుటుంబ సభ్యుల సహకారంతో మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని అన్నారు. నేర్చుకోవడానికి హద్దు లేదని అది జీవితాంతం కొనసాగే నిరంతర ప్రక్రియ అని అన్నారు. కృత్రిమ మేధ మన జీవితాల్లోకి చొచ్చుకు వచ్చిన తరువాత మనం మరింత అడ్వాన్స్ కావాలని అన్నారు. ఎప్పటికీ సేఫ్‌జోన్‌లో ఉండకుండా వీలయితే అనేక ప్రదేశాలు తిరిగి వివిధ సంస్కృతులను తెలుసుకోవాలన్నారు. హార్డ్ వర్క్ ఎప్పుడూ వృథా కాదనే విషయం విద్యార్థులు గమనించాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉపేందర్ మాట్లాడుతూ రెండు రోజుల సదస్సు విజయవంతం అయిందని, విద్యార్థులు ఈ సదస్సు ద్వారా ఎంతో నేర్చుకున్నారని నిర్వాహకులను అభినందించారు. సదస్సు సంచాలకుడు డాక్టర్ ఎం.అనిల్‌కుమార్ రెండు రోజుల సదస్సు నివేదికను సమర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ప్రసన్నకుమార్, సదస్సు కో కన్వీనర్ డాక్టర్ బొజ్జ అనిల్‌కుమార్, అధ్యాపకులు సుధాకర్, డాక్టర్ జ్యోత్స్న, శివరాణి, శిరీష, సిద్దేశ్, కృష్ణ, కోటయ్య, సరిత, మహేశ్వరి, అంకుష్, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న బెస్ట్ యూనివర్శిటీ వైస్ ఛాన్స్‌లర్ కె.నాగజ్యోతి

మహిళా శిశు సంక్షేమానికి ప్రాధాన్యం



కలెక్టర్ హనుమంతరావు, సంక్షేమ శాఖ సిబ్బందితో మహిళా శిశు సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మోతి

భువనగిరి (కలెక్టరేట్), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మహిళా శిశు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ఈమేరకు ఉద్యోగులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.మోతి అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులు సిబ్బందితో జిల్లాలో మహిళా శిశు సంక్షేమం-ప్రభుత్వ పథకాల అమలు వాటి ప్రగతిపై సమీక్షించారు. శాఖాపరమైన అభివృద్ధి పనులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేసి రాష్ట్రంలో యాదాద్రి భువనగిరి జిల్లాను ముందంజలో నిలపాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ హనుమంతరావును మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు బాల సదనం సందర్శించి జిల్లా మాలల పరిరక్షణ విభాగం ఉద్యోగులు సిబ్బందికి ఇన్‌స్టిట్యూట్స్ సందర్శనలు, పిల్లల ఫాలోఅప్‌ల వివరాలను నమోదుపై పలు సూచనలు ఇచ్చారు. పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కరరావు, ఆర్డీవో క్రిష్ణారెడ్డి, జిల్లా సంక్షేమాధికారి కొండాపురం నర్సింహారావు, సీడీపీవోలు విజయలక్ష్మి, శ్వేత, అనంత లక్ష్మి, డీడబ్ల్యూవో సూపరింటెండెంట్ శశికళ, యశోద పాల్గొన్నారు.

టీచర్..మమ్మల్ని విడిచి వెళ్లొద్దు

● వీడ్కోలు కార్యక్రమంలో వేడుకున్న విద్యార్థినులు

ఆత్మకూర్(ఎస్), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మమ్మల్ని విడిచి వెళ్లొద్దు టీచర్ అంటూ పలువురు విద్యార్థినులు బోరు న విలపించారు. మంగళవారం సాయంత్రం సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండల పరిషత్ పాఠశాలలో ఈ సంఘటన జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా విధు లు నిర్వర్తిస్తున్న పి.వనజ బదిలీపై మోతె మండలం నామవరం పాఠశాలకు స్కూల్ అసిస్టెంట్‌గా బయోసైన్స్ పదోన్నతిపై వెళుతున్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులు ఆమెకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థిను లు ఆమెను పట్టుకొని పాఠశాలను, తమను విడిచి వెళ్లవద్దు అంటూ బోరున కంట తడిపెట్టారు. 'మా టీచర్ మాకే ఉండా లి' అంటూ కన్నీరు మున్నీరుగా విలపించారు. పదోన్నతిపై వెళుతున్న ఆమెకు అడ్డు పడుతూ టీచర్‌పై పట్టుకుని ఏడుస్తున్న విద్యార్థినులను ఓదార్చడం అక్కడున్న అధికారులు, తోటి ఉపాధ్యాయుల వల్ల కూడా కాలేదు. టీచర్‌పై విద్యార్థులు చూపుతున్న అభిమానికి, ఆవేదనకు సైతం అధికారులు, ఇతర ఉపాధ్యాయులు కంట తడి పెట్టారు. ఏడు సంవత్సరాలుగా పి.వనజ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు గా విద్యార్థులకు క్రమశిక్షణను అలవాటు చేశారు. అంతకుముందు బదిలీపై వెళుతున్న వనజను ఎంఈవో ధారాసింగ్, కాంప్లెక్స్ ఉపాధ్యాయుడు పి.శ్రవణ్‌కుమార్, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.



ఉపాధ్యాయురాలు పి.వనజను పట్టుకుని విలపిస్తున్న విద్యార్థినులు

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

● విద్యాశాఖ ఫైనాన్స్, అకౌంట్ అధికారి యోగీంద్రనాథ్

చిట్యాలరూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటుగా క్రీడల్లో రాణించాలని విద్యాశాఖ ఫైనాన్స్, అకౌంట్ అధికారి యోగీంద్రనాథ్ అన్నారు. చిట్యాల మండలం పెద్దకాపర్తిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొని ప్రతిభను చూపగా విజేతలకు బహుమతులందజేశారు. ఈసందర్భంగా యోగీంద్రనాథ్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తూనే క్రీడలపై మక్కువను పెంచుకోవాలన్నారు. పలు క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు మెళకువలను నేర్చుకుంటూ ప్రతిభను కనబరచి రాణించాలన్నారు. క్రీడల్లో రాణించినట్లయితే ఉద్యోగ, ఉపాధిరంగాల్లో అవకాశాలు లభిస్తాయన్నారు. విద్యార్థులకు ఏదుళ్ల రఘుపతిరెడ్డి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. భోజన సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేయడంతో రఘుపతిరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో పానుగోతు సైదానాయక్, ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీధర్, నీలకంఠం నరేష్, తాటి చంద్రమౌళి, గుండెబోయిన నర్సింహ, చేకూరి గణేష్, శిర్సు సైదులు, మర్రి శ్రవణ్‌కుమార్, ఏదుళ్ళ కొండల్‌రెడ్డి, లుకేందర్ రెడ్డి, రాధ, యశోధరరెడ్డి, కైలాష్, లచ్చిరెడ్డి, యాదగిరిరెడ్డి, రవీందర్, విజయలక్ష్మి, యుగంధర్‌రెడ్డి, బ్రహ్మయ్య, శ్రీదేవవి, రమణ తదితరులు పాల్గొన్నారు.

6.2 కిలోల కణితి తొలగింపు

● నల్లగొండ జిల్లా మహిళకు భువనగిరిలో శస్త్ర చికిత్స

భువనగిరి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వివాహిత మహిళ గర్భం నుంచి 6.2 కిలోల క్యాన్సర్ కణితి తొలగించిన అరుదైన శస్త్ర చికిత్స మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో జరిగింది. నల్లగొండ జిల్లా చిట్యాల మండలానికి చెందిన మహిళ(50) కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యానికి గురైంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన రోగనిర్ధారణ పరీక్షల్లో ఆమె కడుపులో కణితి ఉన్నట్టు తేలింది. దీంతో ప్రముఖ ఆంకాలజీ సర్జన్ డాక్టర్ మహేష్, అనస్తీషియా డాక్టర్ మధుకుమార్ భువనగిరిలోని జయలక్ష్మీ హాస్పిటల్‌లో ఆమెకు శస్త్ర చికిత్స చేసి క్యాన్సర్ కణితిని తొలగించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉంది. త్వరలోనే కోలుకొని సాధారణ జీవితం గడుపుతుందని వైద్యులు పేర్కొంటున్నారు.

వల్లాల మోడల్ స్కూల్‌లో కెమిస్ట్రీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

శాలిగౌరారం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం వల్లాల మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న కెమిస్ట్రీ పోస్టుకు గంటల ప్రాతిపదికన బోధించటానికి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ తెలిపారు. అర్హత గల అభ్యర్థులు నేటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. బీఈడీ ట్రైనింగ్ పూర్తిచేసి ఉండాలని, సెప్టెంబరు 1న డెమో, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

కోలాటం మహిళలకు చీరల బహూకరణ

నార్కట్‌పల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): చెర్వుగట్టులోని కోలాటం కళాకారులైన మహిళలకు మాజీ ఎంపీటీసీ మేకల రాజిరెడ్డి, కమ్మంపాటి వెంకటయ్య చీరలు, కాలిగజ్జెలను సోమవారం రాత్రి చెర్వుగట్టులో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మేకల కరుణాకర్‌రెడ్డి, బాలెం బిక్షం, మారుపాకల ప్రభాకర్‌రెడ్డి, దొడ్డి నర్సింహ, వంపు శివ, గాదరి రాంబాబు, పానుగుళ్ల శంకర్, దొడ్డి యాదయ్య, వనం శంకర్, గుంటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతులనే పూజిద్దాం

● పలు మండలాల్లో గణపతి విగ్రహాల పంపిణీ
● పాల్గొన్న స్వచ్ఛంద సంస్థలు


నల్లగొండలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

చండూరు, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హానీ చేయని మట్టి గణపతులను పూజించి పర్యావరణ పరిరక్షలో అందరూ భాగస్వాములు కావాలని చండూరు మునిసిపల్ కమిషనర్ మల్లేశం పిలుపునిచ్చారు. స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద పట్టణ ప్రజలకు వెయ్యి మట్టి విగ్రహాలన పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

● మర్రిగూడ : మండల కేంద్రంలో జడ్పీ ఉన్నత పాఠశాల నుచి బస్టాండ్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో బిట్టు శ్రీనివాస్ మాట్లాడుతూ రసాయనాలతో చేసిన విగ్రహాల వల్ల ప్రజలు అనారోగ్యాలుకు గురవుతారని వాటి నిషేధించి వాటి స్థానంలో మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకున్నట్లయితే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చుఅన్నారు. ర్యాలీలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి : మండల కేంద్రానికి చెందిన కందగట్ల శ్రీనివాస్ ఉచితంగా పంపిణీ చేస్తున్న మట్టి విగ్రహాలను మంగళవారం ఎస్ఐ దగ్గల క్రాంతికుమార్ తన చేతుల మీదుగా అందజేశారు. పదేళ్ల మట్టి వినాయక విగ్రహాలను అందజేస్తున్న శ్రీనివాస్‌ను ఎస్ఐ అభినందించారు కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం నాయకులు బిల్లకంటి శ్రీకాంత్, పాల్వాయి భాస్కర్‌రావు, ఇడుకుళ్ల భిక్షమయ్య, పసునూరి శ్రీనివాస్, దేవరశెట్టి నారాయణ, బండారు శ్రీనివాస్, గట్టు అశోక్, పసునూరి చంద్రశేఖర్, ఇడుకుళ్ల సంపత్, కందగట్ల పద్మ పాల్గొన్నారు. అలాగే చెర్వుగట్టులో ఈవో సిరికొండ నవీన్‌కుమార్, ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ భక్తులకు మట్టి విగ్రహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది ఉన్నారు.


చిట్యాల: మునిసిపాలిటీలో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్

● కనగల్: యూనివర్సల్ లెర్నర్స్ రిసోర్స్ ఫౌండేషన్‌ఆధ్వర్యంలో కనగల్‌లో మట్టి గణపతి ప్రతిమలను డీటీ పార్వతమ్మ, ఎస్ఐ రాజీవ్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ బెల్లి జనార్ధన్ అధ్యక్షుడు లచ్చిరాంనాయక్, బచ్చనగోని కిరణ్, శివలీల తదితరులు పాల్గొన్నారు.

● గట్టుప్పల్ : పర్యావరణ పరిరక్షణకు నిరంతరం కస్తూరి ఫౌండేషన్ కృషి చేస్తుందని అందులో భాగంగానే ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలని కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నామని కస్తూరి ఫౌండేషన్ సభ్యుడు పగిళ్ల బిక్షం అన్నారు. మంగళవారం కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీ చరణ్ పంపించిన మట్టి గణపతుల విగ్రహాలను మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో విద్యార్థులకు ఆర్ఎస్ఎస్ చండూరు ఇన్‌చార్జి అజయ్‌తో కలిసి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గంజి రాములు, గాజుల అనిల్, కొంగరి నరహరి, గంజి శంకర్, చెరుపెల్లి శ్యామ్, కొంగర పాండు, జెల్ల కృష్ణయ్య, ఆచార్యులు, మాతాజీలు తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల పర్యావరణ హితమైన మట్టి గణపతులనే పూజించాలని చిట్యాల మున్సిపల్ కమీషనర్ దండు శ్రీనివాస్ కోరారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవోపీతో తయారు చేయబడిన గణపతి విగ్రహాలు పర్యావరణానికి హని చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రవణ్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కొరతపై తలోమాట : చిరుమర్తి

నార్కట్‌పల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరతపై మంత్రులు తలోమాట మాట్లాడుతూ రైతులను గందరగోళానికి, అయోమయానికి గురిచేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలకేంద్రంలోని పీఏసీఎస్ ఎదుట మంగళవారం యూరియా కోసం బారులు తీరిన రైతులను కలిసి మాట్లాడారు. యూరియా నిల్వలను పంపిణీ చేస్తున్న తీరుపై ఏవో గౌతమ్, సంఘం సీఈవో రవీందర్‌లను అడిగి తెలుసుకుని అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు యూరియా కొరత లేదంటే మరో మంత్రి, ఎంపీ యూరియా కొరతకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అలసత్వమే కారణమని ఆరోపిస్తున్నారని విమర్శించారు. రైతులకు యూరియా అందించడంలో ప్రభుత్వం చేతులెత్తేసిందని, ఇది చేతకాని కాంగ్రెస్ పాలనకు నిదర్శనమన్నారు. యూరియా విషయంలో కాంగ్రెస్-బీజేపీలు దొందూ దొందేనని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, యానాల అశోక్‌రెడ్డి, దుబ్బాక శ్రీధర్, కర్నాటి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆందోళనకు గురిచేయవద్దు

● డీసీఎంఎస్ మాజీ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న బోళ్ల వెంకట్‌రెడ్డి

కేతేపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): యూరియా కొరత పేరిట రైతులను బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు గురి చేయడం సరైందికాదని కేతేపల్లి పీఏసీఎస్ చైర్మన్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి తెలిపారు. పీఏసీఎస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో రైతులకు యూరియా కొరత ఉందంటూ మాజీ ఎమ్మెల్యే లింగయ్య పనిగట్టుకుని అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తమ సొసైటీ ద్వారా ఇప్పటికే 240టన్నుల యూరియాను రైతులకు అందించామన్నారు. రైతులకు అవసరమైన మేరకు పీఏసీఎస్ ద్వారా యూరియా సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్న వ్యాపారులను పక్కన బెట్టుకుని ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్, మాజీ జడ్పీటీసీ కోట మల్లికార్జునరావు, కాంగ్రెస్ నాయకులు బొజ్జ సుందర్, కోట పుల్లయ్య, బయ్య ముత్తయ్య, జె.వెంకటనర్సయ్యయాదవ్, బీరం జాన్‌రెడ్డి, ఎన్.కిరణ్ గౌడ్, అంధ్రయ్య, ఎ.వెంకట్‌గౌడ్, జె.సౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలతో అప్రమత్తంగా ఉండాలి

చండూరు, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలని చండూరు మునిసిపల్ కమిషనర్ మల్లేశం అన్నారు. చండూరు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు వీధి కుక్కల సంచారం ఉన్న ప్రాంతాల్లో జాగ్రత్తగా ఉండాలని, వాటి కళ్లల్లోకి నేరుగా చూడవద్దని, వెంట పడితే ఆగిపోవాలన్నారు. కుక్కలను రెచ్చగొట్టవద్దని, వాటి జోలికి వెళ్లొదని సూచించారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ అధికారి అరవింద్‌రెడ్డి, వార్డు ఆఫీసర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

నల్లగొండరూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నల్లగొండ డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎం.నరసింహయ్య, ఎస్.కె గులాంరసూల్ కోరారు. ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయూ) నల్లగొండ డిపో కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం డీఎంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాంకాలంలో నిర్ణయించిన పెన్సిల్ అలవెన్స్ రూపాయలు నేటికీ కొనసాగుతుందని, అది వెయ్యి రూపాయలు పెంచాలని అన్నారు. ఎలక్ట్రికల్ వెహికల్ జేబీఎం డ్రైవర్లకు గుర్తింపు కార్డు ఇవ్వాలని, ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

నీలగిరిలో ప్రకటనల బోర్డుల తొలగింపు


ఎక్స్‌కవేటర్లతో ప్రకటన బోర్డులను తొలగిస్తున్న సిబ్బంది

రామగిరి ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో ప్రధాన రహదారులపై అక్రమంగా ఏర్పాటు చేసిన ప్రకటనల బోర్డులను మునిసిపల్ అధికారులు మంగళవారం ఎక్స్‌కవేటర్లతో తొలగించారు. పట్టణంలోని గడియారం సెంటర్ నుంచి హైదరాబాద్ రోడ్డు వరకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు. ఈ సందర్భంగా ము నిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్ మాట్లాడుతూ ఫ్లెక్సీలు, సైన్ బోర్డులు సెంట్రల్ పోల్స్ ఏర్పాటు చేసిన లైట్లకు అడ్డుగా వస్తున్నాయని అన్నారు. రానున్న వినాయక చవితి దృష్ట్యా నిమజ్జన సమయంలో సెంట్రల్ పోల్స్ ఉన్న ఫ్లెక్సీలు విగ్రహాలకు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉండడంతో వాటిని తొలగించినట్లు ఆయన తెలిపారు.

రైస్ మిల్లుల్లో ధాన్యం వివరాలు ఉండాలి

మర్రిగూడ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వర్కింగ్, ట్రేడింగ్‌లలో ఏ మిల్లులోనైనా సరే ధాన్యం వివరాలు ఉండాలని పౌర సరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్ స్పష్టం చేశారు. మంగళవారం మర్రిగూడ, భీమదేవరపల్లిలో ఉన్న రైస్‌మిల్లులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ ఏ మిల్లులోనైనా ఎంత ధాన్యం కొనుగోలు చేశారో వివరాలను సంబంధిత రిజిస్టర్‌లో పొందుపర్చాలని సూచించారు. కొన్ని మిల్లులు రేషన్ బియ్యం దందా చేస్తున్నట్లు ఆరోపణలు, ఫిర్యాదులు ఉన్న రైస్‌మిల్లులను తనిఖీ చేస్తున్నట్లు వివరించారు. మిల్లుకు పేరు లేకపోతే మరింత అనుమానం కలిగే అవకాశం లేకపోలేదన్నారు.

జీపీ నూతన భవనానికి భూమి పూజ

మర్రిగూడ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మర్రిగూడ మండలంలోని రాజపేట తండా గ్రామ పంచాయతీలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను మండల అభివృద్ధి అధికారులు ప్రారంభించారు. మంగళవారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. పంచాయతీ భవన నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ.20లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రవికుమార్, కార్యదర్శి మౌనిక, మారగోని వెంకట్రాం, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎఫ్‌బీఎస్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

మర్రిగూడ, కనగల్, శాలిగౌరారం, ఆగస్టు ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి (ఎన్ఎఫ్‌బీఎస్) ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మర్రిగూడ, కనగల్, శాలిగౌరారం తహసీల్దార్లు జక్కర్తి శ్రీనివాస్, పద్మ, షేక్ జహీరుద్దీన్ తెలిపారు. మంగళవారం ఆయా మండలాల్లో నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. 18 నుంచి 59 సంవత్సరాల మధ్య కుటుంబ పెద్ద మృతి చెంది ఉండి కుటుంబాన్ని పోషించే బాధిత మహిళ కు టుంబానికి జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పథకం ద్వారా బాధిత కుటుంబానికి రూ.20వేల ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. 2017 ఏప్రిల్ 1 తర్వాత కుటుంబ పెద్ద చనిపోయి ఉండాలని, మరణ ధ్రువీకరణ పత్రం జతపరచాలని సూచించారు. బ్యాంక్ ఖాతా, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జతపరచాలని అన్నారు. అర్హులైన వారు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఆయా సమావేశాల్లో ఏపీఎం, సీసీలు, మండల సమాఖ్య అధ్యక్షులు, కార్యదర్శులు, డీటీ వరప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ రాంబాబు పాల్గొన్నారు.

చిట్యాల జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా సుశీల

చిట్యాల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా బోడ సుశీల బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఎంఈవో సైదానాయక్‌తో పాటు తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూర్యప్రకాష్, వెంకన్న, సికిందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మర్రిగూడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకలకు వ్యాధి నివారణ కోసం ఏర్పాటు చేసిన పశు వైద్యశిబిరాలను గొర్రెల, మేకల పెంపకందారుల రైతులు సద్వినియోగం చేసుకోవాలని మర్రిగూడ, శివన్నగూడ పశువైద్యాధికారులు డాక్టర్ సురేందర్, యమున అన్నారు. మంగళవారం మండలంలోని తిరుగండ్లపల్లి, శివన్నగూడ గ్రామంలో పశువులు, మేకలకు వ్యాక్సినేషన్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ వర్షాకాల సీజన్ ప్రారంభమైనందున మేకలు, గొర్రెలకు వ్యాధులు సంక్రమించకుండా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబరు 8వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో టీకాలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశుగణన సహాయకుడు ఏ.ఎల్లేష్ పాల్గొన్నారు.

శాలిగౌరారంలో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటుకు కృషి

● ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేలు


వాటర్ ఫిల్టర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేలు

శాలిగౌరారం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి అ.దిక ప్రాధాన్యమిస్తుందని, శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని 30 పడకల ఆస్పత్రి ఏర్పాటుకు కృషి చేస్తామని ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శాలిగౌరారం పీహెచ్‌సీలో రూ.3 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ప్యూరీఫైడ్ వాటర్ ప్లాంట్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గ పరిధిలో రోగులు అధికంగా వచ్చే పీహెచ్‌సీలను అప్‌గ్రేడ్ కోసం, మిగతా వాటిలో మౌలిక సదుపాయల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే సామేలు మాట్లాడుతూ మండలాన్ని ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డితో కలిసి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. శాలిగౌరారం మార్కెట్‌లో సబ్‌స్టేషన్ పక్కన రోడ్డు మీద ఉన్న డబ్బా షాపలను వెంటనే తొలగించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, మండల వైద్యాధికారిణి సూర్యశిల్ప, శ్వేత, వెంకటేష్, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంపీడీవో జ్యోతిలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమరంరెడ్డి, పౌష్టికాహార దాతలు వడ్లకొండ పరమేష్, పవిత్ర దంపతులు, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ బుడిగె శ్రీనివాసులు, క్లబ్ కార్యదర్శి దామెర్ల శ్రీనివాస్, సభ్యులు గుండు పరమేష్, చామల మహేందర్‌రెడ్డి, రామడుగు వెంకట్రామశర్మ, దునక వెంకన్న, నిమ్మల వీరస్వామి, శంకర్, విజయలక్ష్మి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ముస్తాబైన మండపాలు


కేతేపల్లిలో ప్రతిష్ఠాపనకు సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

కేతేపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో గణేష్ నవరాత్రోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించే మండపాలను యువకులు సర్వాంగ సుందరంగా అలంకరించారు. మండల పరిధిలోని 16గ్రామ పంచాయతీలు, ఆవాస గ్రామాల్లో ప్రతి ఏటా దాదాపు వందకు పైగా వినాయక విగ్రహాలను నెలకొల్పి నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. నవరాత్రోత్సవాల నిర్వహణ కోసం యువకులు బృందాలుగా ఏర్పడి విరాళాలు సేకరించి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించే పనిలో నిమగ్నమయ్యారు. బుధవారం వినాయక చవితిని పురస్కరించుకుని గణేష్ ప్రతిమలను మంటపాల్లో ప్రతిష్ఠించనున్నారు. ఉత్సవాల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి : బీజేపీ

చండూరు, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): చండూరు పీహెచ్‌సీ భవన నిర్మాణం చేపట్టడం లేదని డిమాండ్ చేస్తూ మంగళవారం బీజేపీ పట్టణశాఖ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు పందుల సత్యం మాట్లాడుతూ ప్రస్తుత భవనం కొద్దిపాటి వర్షం కురిసినా ఆసుపత్రి గదులన్నీ జలమయం అవుతున్నప్పటికీ అధికారుల్లో చలనం లేదని ఆరోపించారు. స్థలం కొరత కారణంతో నిర్మాణానికి మోక్షం కలగడం లేదని అధికారులు సాకులు చెబుతున్నారని విమర్శించారు. శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చి వేసి 30పడకల ఆసుపత్రిని వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోమటి వీరేశం, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నెపర్తి యాదగిరి, నాయకులు భూతరాజు శ్రీహరి, బోడ ఆంజనేయులు, సామ వెంకట్‌రెడ్డి, ఇరిగి ఆంజనేయులు, కళ్లెం సురేందర్‌రెడ్డి, తడకమల్ల శ్రీధర్, భూతరాజు స్వామి, సోమ శంకర్, కోమటి ఓంకారం, చెనగోని శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● తిప్పర్తి: మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజుయాదవ్ మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రధాన సమస్యగా ఉన్న మరుగుదొడ్లు, తిప్పర్తి సెంటర్‌లో ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణాలతో పాటు మండలంలోని పలు గ్రామాలకు అంతర్గత రోడ్లను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ధర్నబోయిన గంగాధర్, ఎస్. యాదగిరి, రమేష్, వడ్డే శ్రీనివాస్‌రెడ్డి, మైనం మల్లయ్య, రామకృష్ణ యాదవ్, మధు, కృష్ణ, శివశంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గణపయ్యా.. విఘ్నాలు తొలగించవయ్యా!

(5వ పేజీ తరువాయి)

నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటడంతో మూడుపూటలా కడుపునిండా భోజనం కూడా చేయలేని దయనీయస్థితిని ఎదుర్కొంటున్నామని, ధరలను దించి కడుపునిండా మూడుపూటలు తినేలా గణేశుడు దయచూపాలని మధ్యతరగతి, సామాన్యులు వేడుకుంటున్నారు. చారెడు జీతం, బారెడు ఖర్చులతో జీవనం గడ్డుగా మారిన పరిస్థితుల నుంచి ఒడ్డున పడేలా కరుణించాలని గణేశుడిని కోరుతున్నారు.

గణేశుని కరుణతో పదవులు దక్కించుకుంటామని నేతల ధీమా

వినాయకుడి కరుణతో తమకు పదవీయోగం రావాలని పలువురు అధికార పార్టీ నాయకులు ప్రార్థిస్తున్నారు. పదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉండి ప్రజాసమస్యలపై పోరాడామని, ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేశామని, తమ కష్టాన్ని ప్రభుత్వ పెద్దలు గుర్తించేలా వారికి ప్రేరణ కలిగించాలని పలువురు ఆశావహులు గణేశుడిని ప్రార్థిస్తున్నారు.

తొలి పూజలందుకునే వినాయకుడు వారి మొర ఆలకిస్తారనే విశ్వాసంతో ఉన్నారు. త్వరలో జరిగే నామినేటెడ్ పదవులతో పాటు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం అందించేలా గణేశుడు దీవించాలని కోరుకుంటున్నారు. తమ కష్టాన్ని గుర్తించి ప్రజలు మద్దతుగా ఉండేలా గణేశుడు ఆశీర్వదిస్తారనే నమ్మకంతో విఘ్నేశ్వరుడిని ప్రతిపక్ష నాయకులు పూజిస్తున్నారు. తొలిపండుగ రోజు వినాయకుడిని కొలిస్తే సర్వసుఖాలు, శాంతి దక్కుతుందని, లోకకల్యాణమే ఆయన ఆశీర్వాదమని, భక్తిశ్రద్ధలతో వినాయకుడిని పూజించేందుకు అంతా సిద్ధమయ్యారు.

వ్యాపారాలు వర్ధిల్లాలని వర్తకుల పూజలు

గణేశుని చల్లని చూపులు తమపై ప్రసరించి ఈ ఏడాది వ్యాపారాలు వర్థిల్లాలని, పన్నుల భారం తగ్గాలని వర్తకులు పూజిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న దుకాణాలు, వస్త్ర, బియ్యం, చిల్లర వర్తకులు గణేశ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. నల్లగొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, చౌటుప్పల్, భువనగిరి పట్టణాల్లో వ్యాపారుల నేతృత్వంలో గణేశ్ నవరాత్రులు వైభవంగా కొనసాగనున్నాయి.


మట్టి వినాయకులకు పెరిగిన ఆదరణ

లోక కల్యాణం కోసం నిర్వహించే వినాయక చవితిని కాలుష్యరహితంగా నిర్వహించేందుకు ఏటా ప్రజల్లో చైతన్యం పెరుగుతోంది. గణేష్ విగ్రహాల ప్రతిష్ఠలో పీవోపీ ప్రతిమల స్థానంలో మట్టి గణపతి బొమ్మలను ప్రతిష్ఠించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. నల్లగొండ మునిసిపాలిటీ ఆధ్వర్యంలో 4,100 మట్టి గణపతి విగ్రహాలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి భక్తులకు అందజేశారు. అలాగే క్రెడాయ్, వైఆర్‌పీ, కస్తూరి ఫౌండేషన్ వంటి సంస్థలు ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను అందజేయడమేగాక వాటి ఆవశ్యకతను, పీవోపీ బొమ్మలతో ఏర్పడే కాలుష్యంపై అవగాహన కల్పిస్తున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది మట్టిగణేశ్ విగ్రహాలకు ఆదరణ పెరిగిందని చెబుతున్నారు. పట్టణాల్లో వివిధ సంస్థల ద్వారా ఉచితంగా అందించే మట్టి బొమ్మలతో పాటు, డబ్బు చెల్లించి సైతం మట్టి గణపతి విగ్రహాలను కొనుగోలు చేయడం ఈసారి పెరిగిందని వాటి విక్రయదారులు వాసాచంద్రశేఖర్, గట్టు రాజ్‌కుమార్ తెలిపారు. గత ఏడాది కంటే రెట్టింపు సంఖ్యలో మట్టి గణేశ్ విగ్రహాలను విక్రయించామని చెప్పారు.

అవగాహన కల్పిస్తున్న జేవీవీ

పీవోపీ గణేష్ ప్రతిమలతో నీటి కాలుష్యం ఏ స్థాయిలో ఉంటుందనే అంశంపై ప్రధానంగా జనవిజ్ఞానవేదికలు అవగాహన కల్పిస్తోంది. ఇప్పటికే అంతంతమాత్రంగానే జలవనరులు ఉన్న నల్లగొండ జిల్లాలో పీవోపీతో తయారుచేసిన గణేష్ ప్రతిమల వల్ల ఎంతో హానికరమైన ప్లాస్టర్ ఆఫ్ ప్యారీ స్, సింథటిక్ కలర్స్‌తో చేసిన విగ్రహాలను చెరువుల్లో, నదుల్లో కలపడం వల్ల (నిమజ్జనం చేయడం) ఆ జలాలు కలుషితమవుతున్నాయని వివరిస్తున్నారు. ప్రధానంగా 300 డిగ్రీల ఫారన్‌హీట్ వద్ద జిప్సంను వేడి చేసి పీవోపీ తయా రు చేస్తారని, ఈ పీవోపీ నీటిలో కలిపినప్పుడు మళ్లీ జిప్సంగా మారుతుందని, ఇది చాలా ప్రమాదకరమని పేర్కొంటున్నారు.

మరోవైపు విగ్రహాలకు వేస్తున్న రంగుల్లో విషపూరిత భారలోహాలుంటున్నాయని, ఇవి కూడా పర్యావరణానికి హాని చేస్తున్నాయని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీవోపీ విగ్రహాల తయారీలో ఉపయోగించే పెయింట్‌లో జిప్సమ్, సల్ఫర్, పాస్ఫరస్, మెగ్నీషియం, మెర్క్యూరీ, లెడ్, కాడ్మియమ్, ఆర్సెనిక్, కార్బన్, వంటి రసాయనాలతో క్యాన్సర్ సోకే ప్రమాదముందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. లోకహితం కోరి నిర్వహించే పండుగలో ఉపయోగించే వినాయక విగ్రహాలను, కాలుష్యరహిత బంకమట్టితో, సహజరంగులైన పసుపు, కుంకుమ, గంధం, బియ్యం పొడితో తయారు చేసుకోవాలని సూచిస్తున్నారు.



గరిష్ఠం 29.0
కనిష్ఠం 22.2

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	585 (297.4350)	4,16,324	4,16,324
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.45 (4.06)	2,571	1,702
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.3237 (41.7627)	51,409	51,409

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.220


అందరికీ శుభం జరగాలి



మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా ప్రజలందరికీ శుభం జరగాలని రాష్ట్ర రోడ్డు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. వినాయక చవితి సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆనందోత్సాహాల నడుమ వినాయక చవితి వేడుకలు నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి నిర్విఘ్నంగా కొనసాగుతున్న వేళ సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి గడపకు చేరి ప్రజలందరి జీవితాల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

గణపయ్యా.. విఘ్నాలు తొలగించవయ్యా!



- చల్లగా చూడాలని ప్రార్థనలు
- ధాన్యపురాశులు గలగలలాడేలా ఆశీర్వదించాలని కర్షకుల వేడుకోలు
- పదవీయోగం కలిగేలా చూడు స్వామి అంటున్న నేతలు
- నేడు వినాయక చవితి

విఘ్నేశ్వరుడు నవరాత్రులపాటు పూజలందుకునేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఊరూరా, వాడవాడలా గణేశ్ విగ్రహాల ప్రతిష్ఠకు భక్తులు సన్నాహాలు చేసుకున్నారు. భారీ గణపయ్యలు, పలు రకాల అలంకరణలతో పాటు, మట్టి గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించి తొమ్మిది రోజులు ఘనంగా పూజలు నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే గణేశ్ మండపాల వద్దకు గణపతి విగ్రహాలను తీసుకొచ్చారు. సకల విఘ్నాలు తొలగించే గణేశుడు ఈసారి తమ కష్టాలను తొలగించాలని స్వామివారిని ప్రార్థించేందుకు భక్తులు సిద్ధమయ్యారు.

● ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ

ఈ ఏడాది పంటలు పండి ఒడ్డున పడాలని, ధాన్యపురాశులతో గాదెలు నిండేలా కరుణించాలని అన్నదాతలు గణేశుడిని ప్రార్థిస్తున్నారు. పదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉండి అష్టకష్టాలు పడ్డామని, తమ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచిందని, తమకు గుర్తింపు కలిగించేలా ప్రభుత్వ పెద్దల మనసు మారి పదవులిచ్చేలా విఘ్నేశుడు దయచూపాలని రాజకీయనేతలు కోరుతున్నారు. ఈ ఏడాది కలిసివచ్చేలా ఆశీర్వచనం చేయాలని ప్రతిపక్షాల నాయకులు పూజిస్తున్నారు. తొలి పూజలందుకునే గణేశుడుకి మొర విన్నవిస్తే శుభఫలితమిస్తారనే ఆశాభావంతో భక్తులు ఈ గణేశ్ చతుర్థిని భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.

ధాన్యపురాశులు పండేలా ఆశీర్వదించు స్వామీ

ఈ ఏడాది సీజన్ ఆరంభంలో వర్షాలు లేక ఇబ్బంది పడ్డా, ప్రస్తుతం అనుకూలంగా ఉందని, ఇదే వాతావరణం కొనసాగి పంటలు బాగా పండి, ధాన్యపురాశులు నిండేలా ఆశ్వీరించాలని రైతులు గణేశుడిని కోరుకుంటున్నారు. ఇటీవల వర్షాలతో వరుణదేవుడు కన్నెర్రజేశాడని, ఆ ప్రభావంనుంచి బయటపడి పంటలు చేతి కందేలా ఎలాంటి విఘ్నాలు లేకుండా వినాయకుడు చల్లని చూపు చూడాలని రైతులు ప్రార్థిస్తున్నారు. కూరగాయలు, వంటనూనెలు,

మిగతా 8వ పేజీలో...

పంచాయతీ ఎన్నికలపై ముందుకు

- సెప్టెంబరు 2న ఓటర్ల జాబితా
- ఖరారుకు షెడ్యూల్ ప్రకటించిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- ఇప్పటికే కొనసాగుతున్న జాబితా తయారీ ప్రక్రియ

నల్లగొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రాథమిక కసరత్తు నిర్వహిస్తోంది. ఇప్పటికే వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను రూపొందించే కార్యాచరణను పంచాయతీల వారీగా చేపట్టింది. తాజాగా, మంగళవారం రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ.రాణీకుముదిని పంచాయతీ ఓటర్ల జాబితాల వెల్లడికి తుది షెడ్యూల్‌ను ప్రకటించారు.

గ్రామపంచాయతీలు, వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితాలను ఆయా పంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయాల వద్ద ఈనెల 28న అన్ని ప్రదర్శించనున్నారు. 29న జిల్లా ఎన్నికల అథారిటీ ఆధ్వర్యంలో రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారు. 30న మండల స్థాయిల్లో ఎంపీడీవోల అధ్యక్షతన రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తారు. 28 నుంచి 30వరకు ప్రచురితమైన ఓటర్ల జాబితాల్లో ఏవైనా అభ్యంతరాలు, ఇతర ఫిర్యాదులను తీసుకుంటారు. 31న ఈ అభ్యంతరాలు, ఫిర్యాదులను జిల్లా పంచాయతీ అధికారి పరిష్కరిస్తారు. సెప్టెంబరు 2న తుది ఫొటో ఓటర్ల జాబితాలను వార్డుల వారీగా జిల్లా పంచాయతీ అధికారి ప్రచురిస్తారు. ఈమేరకు జిల్లాలో ఇప్పటికే కొనసాగుతున్న వార్డుల వారీ ఓటర్ల జాబితా కసరత్తు చివరి దశకు చేరిందని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య తెలిపారు.

కొనసాగుతున్న ఓటర్ల జాబితా తయారీ

జిల్లాలో వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోంది. జిల్లాలోని 33 మండలాల్లోని 869 గ్రామ పంచాయతీల్లో, 7,494 వార్డులను ఏర్పాటు చేశారు. ఈ పంచాయతీలన్నింటిలో కలిపి 10,53,920 మంది ఓటర్లు నమోదయ్యారు. ఒక కుటుంబం ఓట్లన్నీ ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం సూచించడంతో ఆమేరకు పంచాయతీ కార్యదర్శులు జాబితాలను సవరిస్తున్నారు. సవరించిన జాబితాలను టీపోల్ యాప్‌లో వార్డుల వారీగా అప్‌లోడ్ చేశారు. జిల్లాలో వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు దాదాపుగా అప్లోడ్ చేసినట్లు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు ఎన్నికలకు ఆదేశించినా తక్షణమే నిర్వహించేందుకు వీలుగా ఇప్పటికే పోలింగ్ స్టేషన్లను సైతం గుర్తించారు. 7,494 పోలింగ్ స్టేషన్లు పంచాయతీ ఎన్నికలకు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం తాజాగా ఇచ్చిన ఆదేశాల ప్రకారం వచ్చే నెల 2వ తేదీన పంచాయతీ ఓటర్ల తుదిజాబితా వెలువడడంతో జాబితా ప్రక్రియ కొలిక్కిరానుంది.

జాతీయ పథకంపై ప్రచారం కల్పించాలి



గట్టుప్పల్‌లో పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద జిల్లాలో 3,500 మందిని చేర్చుకునే అవకాశం ఉందని, అందుకు అర్హులు దరఖాస్తు చేసుకునేలా విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకంపై మంగళవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. తహసీల్దార్, ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ పథకం కింద ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా సుమారు 2,070 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను తహసీల్దార్లు పరిశీలించి ఆర్డీవోలకు సమర్పించాలని, ఆర్డీవోలు ఆన్‌లైన్‌లో డీఆర్వోకు సమర్పించాలని ఆదేశించారు. టెలీకాన్ఫరెన్స్‌లో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలి

(ఆంధ్రజ్యోతి, గట్టుప్పల్): మండల కేంద్రానికి మంజూరైన పీహెచ్‌సీ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మంగళవారం పీహెచ్‌సీ నిర్మాణ పనులను, ఎస్టీ హాస్టల్‌ను ఆమె తనిఖీ చేశారు. ఆమె వెంట తహసీల్దార్ రాములు, ఎంపీడీవో మాదవరెడ్డి, కార్యదర్శి ఎండీ.షఫీ ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

(ఆంధ్రజ్యోతి, మునుగోడు): ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మంగళవారం మునుగోడు పీహెచ్‌సీని కలెక్టర్ తనిఖీ చేశారు. ఆమె వెంట ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ ఎన్.నరేష్, ఎంపీడీవో యుగంధర్‌రెడ్డి, డాక్టర్ నర్మద ఉన్నారు.

తాగునీటి పనులను డిసెంబరులోగా పూర్తి చేయాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, రామగిరి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ మునిసిపాలిటీ పరిధిలో చేపట్టిన తాగునీటి పనులను డిసెంబరులోగా పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం నల్లగొండ మునిసిపాలిటీలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో అమృత్ పథకం కింద సుమారు రూ.56.75కోట్లతో చేపట్టిన తాగునీటి ట్యాంకుల నిర్మాణ పనులు డిసెంబరులోగా పూర్తిచేసి ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. అలాగే ట్యాంకులకు నీరు అందించేందుకు అవసరమయ్యే అదనపు నిధులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మునిసిపాలిటీలో రూ.109కోట్ల ఎస్డీఎఫ్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, మురుగు కాల్వల పనులను మూడు నెలల్లో పూర్తి చేయాలని అన్నారు. నిధులు సరిపోకుంటే తన దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే రాత్రి, పగలు పనులు నిర్వహించి రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ పనులపై ప్రతీ మంగళవారం తాను సమీక్షిస్తానని తెలిపారు. చందనపల్లి బయోమైనింగ్ డంపింగ్ యార్డును త్వరితగతిన శుభ్రం చేయించాలన్నారు. మునిసిపాలిటీలోని అన్ని ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. చెత్త సేకరణకు బుట్టలను ఇంటికీ సరఫరా చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాములు, డీఈలు కార్తీక్, అశోక్, శ్రీధర్‌రెడ్డి, ఏఈలు దిలీప్, ప్రవీణ్, అసిం బాబా, ఏసీపీ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజించాలి

ప్రతీ ఒక్కరు మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నల్లగొండ మునిసిపాలిటీ ఆధ్వర్యంలో సుమారు 4,100 మట్టి వినాయకులను ప్రజలకు ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

పాఠశాలల బలోపేతమే ధ్యేయం

ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

శాలిగౌరారం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని, ప్రభుత్వ విద్య బలోపేతమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెర్కకొండారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల వికాస్ స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో 20 డెస్క్ బెంచీలను పంపిణీచేసి, ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులను స్వచ్ఛంద సంస్థలు ప్రోత్సహించాలన్నారు. పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. బాలవికాస్ లాంటి సంస్థలు ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బాలవికాస్ సీఈవో బాలశౌరి, కాంగ్రెస్ నాయకులు నూక కిరణ్‌కుమార్‌యాదవ్, గచ్చిబౌలి కీస్టోన్ స్కూల్ ఫౌండర్ లక్ష్మీరెడ్డి, తహసీల్దార్ షేక్ జహీరుద్దీన్, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి, ఎంఈవో మందుల సైదులు, మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తాళ్లూరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



మట్టి గణపతి విగ్రహాలను పంపిణీచేస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని నాగార్జున డిగ్రీ కళాశాల ఆవరణలో క్రెడాయ్ ఆధ్వర్యంలో 1,000 మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రెడాయ్ అసోసియేషన్ మట్టి గణపతులను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, క్రెడాయ్ రాష్ట్ర కార్యదర్శి బండారు ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఏచూరి భాస్కర్, ఆమంచి రాజలింగం, నాంపల్లి మనోహర్, దూదిపాల వెంకట్‌రెడ్డి, ఏదుళ్ల శ్రీధర్‌రెడ్డి, ఆవుల శ్రీనివాస్, వంగాల అనిల్‌రెడ్డి, రామారావు, పృథ్వీ, పుల్లారావు, లింగయ్య, పాల్గొన్నారు.

నూతన పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ

నిడమనూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నూతన పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సోమవారం పరిశీలించారు. రిసెప్షన్ మేనేజ్‌మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్, స్టేషన్ రైటర్, లాకప్, ఎస్‌హెచ్‌వో గది, తదితర ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఆయనకు మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం మొక్క బహూకరించగా, స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. ఆయన వెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ సతీష్‌రెడ్డి, ఎస్‌ఐ ఉప్పు సురేష్ ఉన్నారు.

మునిసిపాలిటీ పర్యవేక్షణలోనే ఇబ్రహీంపేట



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో

హాలియా, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సీడీఎంఏ, పీఆర్ కమిషనర్‌ల నుంచి అధికార పత్రాలు వచ్చేదాక హాలియా మునిసిపాలిటీ నుంచి వీడిన ఇబ్రహీంపేట గ్రామాన్ని మునిసిపాలిటీ పర్యవేక్షణలోనే చూడాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) వెంకయ్య అన్నారు. మంగళవారం కలెక్టర్ సూచనల మేరకు ఇబ్రహీంపేట గ్రామ పంచాయతీకి మునిసిపాలిటీ నుంచి రావాల్సిన ఆస్తులు, సిబ్బంది, రికార్డ్స్ తదితరాల గురించి అనుముల మండల ఎంపీడీవో కార్యాలయానికి వచ్చారు. ఈసందర్భంగా ఇబ్రహీంపేట గ్రామానికి వెళ్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, ఎంపీడీవో సుజాత, ఎంపీవో ఘనపురం నిరంజన్, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో టీకాలు వేయించాలి

కనగల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మూగజీవాలకు సకాలంలో టీకాలు వేయించాలని పశువైద్య సంచాలకుడు డాక్టర్ డీవీ రమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మాజీగూడెంలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో సన్నజీవాలకు పీపీఆర్ టీకాలను వేశారు. ఈసందర్భంగా డీవీ.రమేష్ మాట్లాడుతూ మూగజీవాల పెంపకం వాటికి రోగాలు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్రామంలో 550 సన్నజీవాలకు(మేకలకు) టీకాలను వేసినట్టు కనగల్ పశువైద్యాధికారి సీహెచ్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది హనీఫ్, నాగేశ్వరి తదితరులున్నారు.



జీవాలకు టీకాలు వేస్తున్న డాక్టర్ బాబు

ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలి

● డీఆర్‌డీఏ అదనపు పీడీ నవీన్‌కుమార్

మునుగోడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం పనులు పారదర్శకంగా చేపట్టాలని డీఆర్‌డీఏ అదనపు పీడీ నవీన్‌కుమార్ అన్నారు. మునుగోడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జాతీయ ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు మండలంలో చేపట్టిన పనుల వివరాలు చదివి వినిపించారు. రూ. 6.90 కోట్ల నిధుల ఖర్చుతో ఉపాధి హామీ పనులు జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. నిర్దేశించిన నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలన్నారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ సీహెచ్.వేణుగోపాల్‌రావు, అంబుడ్స్‌మన్ ఎంఏ. ఘని, సామాజిక తనిఖీ రాష్ట్ర రిసోర్స్ పర్సన్ సురేంద్రబాబు, ఎంపీడీవో యుగంధర్‌రెడ్డి, ఎంపీవో మహ్మద్ అథర్ పర్వేజ్, ఏపీవోలు నాగరాజు, శీనయ్య, వివిధ గ్రామాల కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, సామాజిక తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

బిహార్ నుంచి గంజాయి తెచ్చి..

- పోలీసులకు పట్టుబడిన ముఠా
- 1350 గ్రాముల గంజాయి, 22 గంజాయి చాక్లెట్స్ స్వాధీనం
- మొత్తం 13 మంది నిందితులు, 10 మంది అరెస్ట్

6

ప్రభుత్వ భూమిలో మట్టి దందా

- సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కొత్తగూడెం గ్రామస్థులు

హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం

మాడ్గులపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మండల అధ్యక్షుడు ఇటికాల జాన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు యూరియాను అందించడంలో విఫలమైందని విమర్శించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగినబుద్ధి చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, నాగరాజు, శ్రీను, ఇందిరా, నర్సింహ పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు సన్మానం

వేములపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి పదో తరగతి పరీక్షలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన భవిత తల్లిదండ్రులు నాగయ్య సరితలను, ఇందుప్రియ తల్లిదండ్రులు ఉపేందర్ అరుణలను సన్మానించారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ దీనసుజాత శాలువాలతో సత్కరించారు. విద్యార్థి తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల కృషితో విద్యార్థులు చక్కని ప్రతిభను కనబరిచారని కొనియాడారు.

గొర్రెలు, మేకలకు వ్యాక్సినేషన్


కొండ్రపోల్‌లో జీవాలకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యులు

దామరచర్ల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 26 నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు గొర్రెలు, మేకలకు ఉచితంగా పీపీఆర్ వ్యాక్సిన్ వేయనున్నట్లు మండల పశువైద్యులు ఎం.సందీప్‌కుమార్, స్వప్న అన్నారు. మండలకేంద్రంతో పాటు కొండ్రపోల్ గ్రామంలో మంగళవారం సుమారు 3వేల గొర్రెలు, మేకలకు ఉచితంగా టీకాలు వేశారు. గొర్రెలు, మేకల పెంపకందారులు తమ జీవాలకు తప్పకుండా వ్యాక్సిన్ వేయించాలని కోరారు. కార్యక్రమంలో మండల గొర్రెల, మేకల సంఘం అధ్యక్షుడు పి.జీడయ్య, సోమయ్య, పశువైద్య సిబ్బంది జానీపాషా, కృష్ణ, ప్రవీణ్, సొసైటీ సభ్యులు, గొర్రెల పెంపకం దారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎఫ్‌పీఎస్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి (ఎన్‌ఎఫ్‌పీఎస్) ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ అనిల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 59 సంవత్సరాల మధ్య కుటుంబ పెద్ద మృతి చెంది ఉండి కుటుంబాన్ని పోషించే బాధిత మహిళ కుటుంబానికి జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పథకం ద్వారా బాధిత కుటుంబానికి రూ.20వేల ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. 2017 ఏప్రిల్ 1 తర్వాత కుటుంబ పెద్ద చనిపోయి ఉండాలని, మరణ ధ్రువీకరణ పత్రం జతపరచాలని, ఏడాది ఆదాయం రూ.60వేలు లోపు ఉండాలని సూచించారు. బ్యాంక్ ఖాతా, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జతపరచాలని అన్నారు. అర్హులైన వారు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

మట్టి వినాయకులను పూజించాలి

● ఎమ్మెల్యేలు బాలునాయక్, బత్తుల లక్ష్మారెడ్డి

దేవరకొండ, మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మట్టి వినాయకులను పూజించి అందరూ పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని ఎమ్మెల్యేలు నేనావత్ బాలునాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. దేవరకొండ, మిర్యాలగూడ పట్టణాల్లో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమాల్లో వారు మట్టి విగ్రహాలను పంపిణీ చేసి మాట్లాడారు. పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించని మట్టి వినాయక ప్రతిమలను ప్రతి ఒక్కరూ పూజించాలని కోరారు. సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందిస్తూనే పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. వినాయక చవితి ఉత్సవాలను ఆనందోత్సాహాలతో శాంతియుతంగా నిర్వహించుకోవాలన్నారు. మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయకులను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. నిమజ్జన తరుణంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

● దేవరకొండ మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పట్టణ ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, నాయకులు పున్న వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురిగి శంకర్, మాజీ కౌన్సిలర్లు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.


దేవరకొండలో మట్టి వినాయకుల ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్


మిర్యాలగడలో పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్, డీఎస్పీ రాజశేఖరరాజు

● మిర్యాలగూడ పట్టణంలో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖరరాజు మాట్లాడుతూ ఉత్సవ కమిటీ సభ్యులు నిబంధనలు పాటిస్తూ ఆనందోత్సాహాల నడుమ పండుగ చేసుకోవాలని అన్నారు. మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, మట్టి విగ్రహాలను పూజించి, నిమజ్జనం చేసిన మట్టిలో మొక్క నాటి పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు జ్ఞానేశ్వరి, వెంకటరమణ, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

● చింతపల్లి మండల కేంద్రంలో ఆర్యవైశ్య రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రాంమూర్తి మాట్లాడుతూ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు వందనపు ఆంజనేయులు, చెట్లపల్లి హరిప్రసాద్, సముద్రాల నగేష్, దాచేపల్లి మధు, జెల్లా యాదగిరి, కొమిరిశెట్టి వినోద్, కొరివి యాదగిరి, కోటేష్, సరాబు వెంకటయ్య, గురునాథం, సురేష్, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

● ఎమ్మెల్యే బాలునాయక్


చందంపేటలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండల కేంద్రంలో మార్నింగ్‌వాక్‌లో భాగంగా మంగళవారం జనహిత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామాలలోని వివిధ కాలనీలలో తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లు, విద్యుత్ సమస్యలు, తాగునీరు, మౌలిక వసతులపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2లక్షల రుణమాఫీ, రేషన్‌కార్డులు, మహాలక్ష్మి పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందిస్తుందని తెలిపారు. రానున్న కాలంలో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రగతిపథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీలక్ష్మి, తహసీల్దార్, పోలీస్ అధికారులు, రెవెన్యూ, వైద్యాధికారులు, పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

● డీఎస్పీ రాజశేఖర్‌రాజు


రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పరేడ్‌లో సిబ్బంది కిట్‌బాక్స్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ

మిర్యాలగూడ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పరేడ్, సిబ్బంది కిట్ బాక్స్, స్మాల్ సర్వీస్ బుక్, స్టేషన్ రికార్డులు, కేస్ ఫైళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ నవరాత్రులు సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిరంతరం నిఘా చేపట్టాలని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధిత పోలింగ్‌స్టేషన్ల పరిధిలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి తగిన ఏర్పాట్లు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, ఎస్ఐ లక్ష్మయ్య పాల్గొన్నారు.

యూరియాను బ్లాక్‌మార్కెట్‌కు తరలించిన ప్రభుత్వం

● కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న గోలి మధుసూదన్‌రెడ్డి, సాధినేని శ్రీనివాసరావు

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన యూరియాను రాష్ట్ర ప్రభుత్వం బ్లాక్ మార్కెట్‌కు తరలించి రైతులను ఇబ్బంది పెడుతుందని కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా కొరత తెలంగాణలో తప్ప మరెక్కడా లేదని అన్నారు. కేంద్రప్రభుత్వం రబీ సీజన్‌కు రాష్ట్రానికి 12.47లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేసిందన్నారు. అందులో 10.43 టన్నులు సరఫరా జరగ్గా, ఖరీఫ్ కోసం ప్రారంభ నిల్వగా 2.04 లక్షల మెట్రిక్ టన్నులు ఉందని పేర్కొన్నారు. ప్రస్తుత సీజన్‌లో కేంద్రం మరో 5.18 లక్షల మెట్రిక్ టన్నులు ఇచ్చిందన్నారు. మొత్తంగా రాష్ట్రానికి 7.22లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉందని గణాంకాలు చూపుతున్నాయని అన్నారు. రాష్ట్రమంత్రుల నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల తప్పుడు విధానాలతోనే యూరియా కృత్రిమ కొరత ఏర్పడిందన్నారు. యూరియా లెక్కలు తేలాలంటే జిల్లాల వారీగా ప్రభుత్వం సరఫరా చేసిన లెక్కలు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం వ్యవసాయాధికారులను కలిసి ఎమ్మార్పీ ధరలకు యూరియా రైతులకు అందించాలని కోరారు. కార్యక్రమాలలో బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు సాధినేని శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, బంటు సైదులు కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి, చలమళ్ల సీతారాంరెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర పిలుపు మేరకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం చింతపల్లి, డిండి మండలాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి తహసీల్దార్లకు వినతిపత్రం అందజేశారు.

చింతపల్లి: విద్యుత్ కోతలు, తాగునీటి ఎద్దడి, పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకులు తహసీల్దార్ రమాకాంత్‌శర్మకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు మాట్లాడుతూ విద్యుత్ కోతలతో పాటు తాగునీటి ఎద్దడి, కుక్కల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సముద్రాల నగేష్, జిల్లా కార్యదర్శి ఎగిరిశెట్టి అనిత, నాయకులు కుక్కడపు రామకృష్ణ, ఎర్ర వెంకటయ్య, వెన్నం శేఖర్, మోర వెంకటరమణ, శివకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సైదులు, మహేష్‌గౌడ్, శ్రీనివాస్, అభినవ్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

● డిండి మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకుడు సుంకారు సైదా డిమాండ్ చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలకేంద్రంలోని ప్రయాణికుల ప్రాంగణం (బస్టాండ్)లో సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిక్షపతినాయక్, సాయికుమార్, సాయిగౌడ్, రేణయ్య, చిరంజీవి, గణేష్, కిట్టు, నవీన్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

తిరుమలగిరి(సాగర్), హాలియా, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని ఎంఈవో కె.శ్రీనివాస్, పల్‌రెడ్డి ఫౌండేషన్ డైరెక్టర్ పల్‌రెడ్డి నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం తిరుమలగిరి(సాగర్), హాలియా మండల కేంద్రాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పల్‌రెడ్డి ఫౌండేషన్ సహాయ సహకారాలతో విద్యార్థులకు బుక్స్, స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ మెరిట్ మీన్స్ స్కాలర్‌షిప్ సాధించేందుకు ఫౌండేషన్ సభ్యులు అందించిన స్టడీ మెటీరియల్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి పల్‌రెడ్డి ఫౌండేషన్ చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ నెలా సమావేశం నిర్వహించాలి

పెద్దవూర, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ సమావేశాలను ప్రతీ నెలా విధిగా నిర్వహించి విద్యార్థుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంఈవో తరి రాము అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యారోగ్య శాఖ సిబ్బంది విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, రక్తహీనత గురించి పోక్సో చట్టం, యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదిగి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రమాదేవి, చంద్రమణి, అలివేలు, చంద్రకళ, లలిత, మేరమ్మ, షాహిని, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

29,30 తేదీల్లో వాలీబాల్ జట్ల ఎంపిక

పెద్దఅడిశర్లపల్లి,ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 కేటగిరీల్లో బాలబాలికలకు మండల స్థాయి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో ఆటల ఎంపిక పోటీలు ఈ నెల 29,30వ తేదీల్లో జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు ఎంఈవో వెంకటయ్య మంగళవారం తెలిపారు. అండర్-14 బాలుర విభాగంలో బాలురు 51 కేజీలు బరువు, బాలికలు 48 కేజీలు ఉండాలని సూచించారు. అదేవిధంగా అండర్-17 బాలబాలికలు 2009 తర్వాత జన్మించి, బరువు 55 కేజీలు ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మండల గేమ్స్ కన్వీనర్ సీహెచ్ ఎల్లయ్య, పీడీలు మల్లేష్, రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు జె.శ్రీనివాస్‌రావు, జీవన్‌కుమార్, జె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు హెల్త్ కార్డుల పంపిణీ


హెల్త్‌కార్డులు అందజేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ

మిర్యాలగూడ లీగల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ న్యాయవాదులకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ హెల్త్‌కార్డులను పంపిణీ చేశారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన హెల్త్‌కార్డుల పంపిణీ అనంతరం ఆయన మాట్లాడారు. హెల్త్‌కార్డుల ద్వారా న్యాయవాదులు, వారి కుటుంబ సభ్యులకు రూ.2లక్షల వరకు కార్పొరేట్ వైద్యం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్డులు న్యాయవాదులకు ఎంతో మేలు చేస్తాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ హెల్త్‌కార్డుల పరిమితిని రూ.2 నుంచి రూ.5లక్షల వరకు పెంచేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అలుగుబెల్లి భూపతిరెడ్డి, న్యాయవాదులు కె.శ్రీనివాస్‌రెడ్డి, సాయికుమార్, సుండి శ్రీనివాస్, పద్మయ్య, జి.శ్రీనివాస్, సైదులు పాల్గొన్నారు.

గణపయ్యా.. విఘ్నాలు తొలగించవయ్యా!

(5వ పేజీ తరువాయి)

నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటడంతో మూడుపూటలా కడుపునిండా భోజనం కూడా చేయలేని దయనీయస్థితిని ఎదుర్కొంటున్నామని, ధరలను దించి కడుపునిండా మూడుపూటలు తినేలా గణేశుడు దయచూపాలని మధ్యతరగతి, సామాన్యులు వేడుకుంటున్నారు. చారెడు జీతం, బారెడు ఖర్చులతో జీవనం గడ్డుగా మారిన పరిస్థితుల నుంచి ఒడ్డున పడేలా కరుణించాలని గణేశుడిని కోరుతున్నారు.

గణేశుని కరుణతో పదవులు దక్కించుకుంటామని నేతల ధీమా

వినాయకుడి కరుణతో తమకు పదవీయోగం రావాలని పలువురు అధికార పార్టీ నాయకులు ప్రార్థిస్తున్నారు. పదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉండి ప్రజాసమస్యలపై పోరాడామని, ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేశామని, తమ కష్టాన్ని ప్రభుత్వ పెద్దలు గుర్తించేలా వారికి ప్రేరణ కలిగించాలని పలువురు ఆశావహులు గణేశుడిని ప్రార్థిస్తున్నారు.

తొలి పూజలందుకునే వినాయకుడు వారి మొర ఆలకిస్తారనే విశ్వాసంతో ఉన్నారు. త్వరలో జరిగే నామినేటెడ్ పదవులతో పాటు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం అందించేలా గణేశుడు దీవించాలని కోరుకుంటున్నారు. తమ కష్టాన్ని గుర్తించి ప్రజలు మద్దతుగా ఉండేలా గణేశుడు ఆశీర్వదిస్తారనే నమ్మకంతో విఘ్నేశ్వరుడిని ప్రతిపక్ష నాయకులు పూజిస్తున్నారు. తొలిపండుగ రోజు వినాయకుడిని కొలిస్తే సర్వసుఖాలు, శాంతి దక్కుతుందని, లోకకల్యాణమే ఆయన ఆశీర్వాదమని, భక్తిశ్రద్ధలతో వినాయకుడిని పూజించేందుకు అంతా సిద్ధమయ్యారు.

వ్యాపారాలు వర్థిల్లాలని వర్తకుల పూజలు

గణేశుని చల్లని చూపులు తమపై ప్రసరించి ఈ ఏడాది వ్యాపారాలు వర్థిల్లాలని, పన్నుల భారం తగ్గాలని వర్తకులు పూజిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న దుకాణాలు, వస్త్ర, బియ్యం, చిల్లర వర్తకులు గణేశ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. నల్లగొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, చౌటుప్పల్, భువనగిరి పట్టణాల్లో వ్యాపారుల నేతృత్వంలో గణేశ్ నవరాత్రులు వైభవంగా కొనసాగనున్నాయి.

మట్టి వినాయకులకు పెరిగిన ఆదరణ

లోక కల్యాణం కోసం నిర్వహించే వినాయక చవితిని కాలుష్యరహితంగా నిర్వహించేందుకు ఏటా ప్రజల్లో చైతన్యం పెరుగుతోంది. గణేష్ విగ్రహల ప్రతిష్ఠలో పీవోపీ ప్రతిమల స్థానంలో మట్టి గణపతి బొమ్మలను ప్రతిష్ఠించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. నల్లగొండ మునిసిపాలిటీ ఆధ్వర్యంలో 4,100 మట్టి గణపతి విగ్రహాలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి భక్తులకు అందజేశారు. అలాగే క్రెడాయ్, వైఆర్‌పీ, కస్తూరి ఫౌండేషన్ వంటి సంస్థలు ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను అందజేయడమేగాక వాటి ఆవశ్యకతను, పీవోపీ బొమ్మలతో ఏర్పడే కాలుష్యంపై అవగాహన కల్పిస్తున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది మట్టిగణేశ్ విగ్రహాలకు ఆదరణ పెరిగిందని చెబుతున్నారు. పట్టణాల్లో వివిధ సంస్థల ద్వారా ఉచితంగా అందించే మట్టి బొమ్మలతో పాటు, డబ్బు చెల్లించి సైతం మట్టి గణపతి విగ్రహాలను కొనుగోలు చేయడం ఈసారి పెరిగిందని వాటి విక్రయదారులు వాసాచంద్రశేఖర్, గట్టు రాజ్‌కుమార్ తెలిపారు. గత ఏడాది కంటే రెట్టింపు సంఖ్యలో మట్టి గణేశ్ విగ్రహాలను విక్రయించామని చెప్పారు.

అవగాహన కల్పిస్తున్న జేవీవీ

పీవోపీ గణేష్ ప్రతిమలతో నీటి కాలుష్యం ఏ స్థాయిలో ఉంటుందనే అంశంపై ప్రధానంగా జనవిజ్ఞానవేదికలు అవగాహన కల్పిస్తోంది. ఇప్పటికే అంతంతమాత్రంగానే జలవనరులు ఉన్న నల్లగొండ జిల్లాలో పీవోపీతో తయారుచేసిన గణేష్ ప్రతిమల వల్ల ఎంతో హానికరమైన ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్, సింథటిక్ కలర్స్‌తో చేసిన విగ్రహాలను చెరువుల్లో, నదుల్లో కలపడం వల్ల (నిమజ్జనం చేయడం) ఆ జలాలు కలుషితమవుతున్నాయని వివరిస్తున్నారు. ప్రధానంగా 300 డిగ్రీల ఫారన్‌హీట్ వద్ద జిప్సంను వేడి చేసి పీవోపీ తయారు చేస్తారని, ఈ పీవోపీ నీటిలో కలిపినప్పుడు మళ్లీ జిప్సంగా మారుతుందని, ఇది చాలా ప్రమాదకరమని పేర్కొంటున్నారు.

మరోవైపు విగ్రహాలకు వేస్తున్న రంగుల్లో విషపూరిత భారలోహాలుంటున్నాయని, ఇవి కూడా పర్యావరణానికి హాని చేస్తున్నాయని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీవోపీ విగ్రహాల తయారీలో ఉపయోగించే పెయింట్‌లో జిప్సమ్, సల్ఫర్, పాస్పరస్, మెగ్నీషియం, మెర్క్యురీ, లెడ్, కాడ్మియమ్, ఆర్సెనిక్, కార్బన్, వంటి రసాయనాలతో క్యాన్సర్ సోకే ప్రమాదముందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. లోకహితం కోరి నిర్వహించే పండుగలో ఉపయోగించే వినాయక విగ్రహాలను, కాలుష్యరహిత బంకమట్టితో, సహజరంగులైన పసుపు, కుంకుమ, గంధం, బియ్యం పొడితో తయారు చేసుకోవాలని సూచిస్తున్నారు.

అక్రమ డిప్యూటేషన్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


ఎంఈవోకు ఫిర్యాదు చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మూతబడిన స్కూల్‌కు అక్రమంగా డిప్యూటేషన్‌ను చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా, మండల నాయకులు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యం లో మంగళవారం ఎంఈవో కె.శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని నెల్లికల్‌లో గల జడ్పీహైస్కూల్‌లో విద్యార్థులు లేని కారణంగా పాఠశాల గతేడాది మూతపడిందన్నారు. అయితే ఆ పాఠశాల కాంప్లెక్స్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న జి.సుహాసినమ్మ మూతపడిన పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నట్లు శాలిగౌరారం మండలం ఉట్కూరు జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఒక ఉపాధ్యాయుడికి హాజరు ధ్రువీకరణ పత్రాన్ని మంజూరు చేసినట్లు ఆరోపించారు. అసలు విద్యార్థులే లేని పాఠశాలకు డిప్యూటేషన్ వేయడం, హాజరు పత్రాన్ని ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని అన్నారు. అక్రమ డిప్యూటేషన్‌పై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కోశాధికారి వడ్త్యా రాజు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఎరనాగుల సైదులు, మండల ఉపాధ్యక్షుడు వినయ్‌కుమార్, నాగమణి, సీనియర్ నాయకులు అంజిబాబు, శైలజ పాల్గొన్నారు.

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : వార్-2, వెంకటేశ్వర: మహావతార్ నరసింహ రాఘవ: కూలీ, విట్రోస్: కూలీ, వార్-2,కింగ్‌డమ్ దేవరకొండ : మనోజ్ : వార్ 2 మైత్రి వెంకటేశ్వర : కూలీ